

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖా మంత్రి పొంగులేటి
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాల అమలు ఆగదు
- రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

4 లో..



# మనం ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com | మంగళవారం | 20 | అక్టోబర్ | 2026 | పేజీలు : 22

## వైన్ షాపుల్లో నిల్.. బెల్ట్ షాపుల్లో ఫుల్..!

- రూ.190 బీరు రూ.230-240కు విక్రయం?
- ధరల నియంత్రణ ఏదీ.. పర్యవేక్షణ ఏదీ?
- స్పందించని ఎక్సైజ్ అధికారి



మండల కేంద్రంలోని వైన్షాపుల్లో కొన్ని రకాల మద్యం, కింగ్ఫిషర్ బీరు అందుబాటులో ఉండటం లేదని, అదే సమయంలో గ్రామాల్లోని బెల్టాషాపుల్లో మాత్రం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. వైన్షాపుల్లో దొరకని మద్యం బెల్టాషాపుల్లో ఎలా లభిస్తోందని, ఆయా విక్రయ కేంద్రాలకు మద్యం నిల్వలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. - కొణిజర్ల, మనం న్యూస్

6 లో..



## జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరగా పూర్తిచేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- టన్నెల్‌తో పాటు పాలేరు లింక్ కాలువ పనులు సమాంతరంగా పూర్తిచేయాలి
- కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలి
- ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 19 (మనంప్రతినిధి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, పాపకొల్లు గ్రామ పరిధిలోని భోజ్య తండా అటవీ ప్రాంతంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పథకంలో ప్యాకేజీ నంబర్ 8 కింద నిర్మిస్తున్న జూలూరుపాడు టన్నెల్ పనులను రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా టన్నెల్ నిర్మాణం, పాలేరు లింక్ కాలువ పనులు, ప్రాజెక్టు అనుసంధానంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టులో కీలకమైన జూలూరుపాడు టన్నెల్ పనులను వేగవంతం చేసి వచ్చే విజయదశమి నాటికి పూర్తి చేయాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. టన్నెల్ పనులతో పాటు పాలేరు లింక్ కాలువ నిర్మాణాన్ని సమాంతరంగా చేపట్టి, టన్నెల్ పూర్తయ్యేలోగా కాలువ పనులు కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గతంలో భారీ మట్టి కట్టల నిర్మాణంపై నిపుణుల కమిటీ సాంకేతిక అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో , టన్నెల్ నిర్మాణంపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. నిపుణుల కమిటీ సూచనల మేరకు టన్నెల్ నిర్మాణం సురక్షితమైనదిగా, పనులను వేగంగా పూర్తి చేసేందుకు అనుకూలమైనదిగా నిర్ధారించినట్లు తెలిపారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్కు తరలించేందుకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ముఖ్యమంత్రి 4 వేల కోట్లు

- మిగతా 2లో..

## ఇందిరమ్మ వివక్షపై సమరం

- ఇందిరమ్మ కమిటీల పేరుతో సర్పంచ్ హక్కులకు తూట్లు
- జెండా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇండ్లు
- 22 కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

2 లో




## నవంబర్ 15 నాటికి వెలుగుమట్ల కాలనీ నిర్మాణాలు పూర్తిచేయాలి



- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రతి మూడు రోజులకు పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలి
- నవంబర్ 8 నాటికి ఇళ్లపై సోలార్ రూఫ్టాప్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలి
- డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- వెలుగుమట్ల కాలనీని పరిశీలించిన మంత్రి తుమ్మల

2 లో

## జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఆయా నియోజకవర్గాల్లో కాలువల నిర్మాణానికి అవసరమైన భూముల విషయంలో రైతులను ఒప్పించి పనులు ముందుకు సాగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని, భూముల సర్వే ఆధారంగా అర్హులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగించుకుని జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, రిజర్వాయర్లను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. సింగభూపాలెం, అన్నదైవం, వెంగళరాయసాగర్, వైరా, లంకాసాగర్ తదితర ప్రాజెక్టులకు నీటిని అందించడం ద్వారా రైతులకు ప్రయోజనం కలిగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మారెళ్ళ పాడు లిఫ్ట్ ద్వారా పినపాక ప్రాంతంలో సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కూడా సాగునీటి సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి రైతులకు సూచించారు. సాగునీటితో పాటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా నీరు, విద్యుత్ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జూలూరుపాడు–వినోబానగర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం కాలువలో నీటి ప్రవాహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు కరువు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు గోదావరి జలాల వినియోగం కీలకమని మంత్రి అన్నారు. జూలూరుపాడు టన్నెల్, అనుసంధాన కాలువల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్, ఖమ్మం సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుర్రం రాకేష్‌రెడ్డి



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** ఏదులాపురం మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నత విద్యావంతుడు గుర్రం రాకేష్‌రెడ్డి (ఎం.ఏ., బి.ఈడీ.) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు. మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి ఆశీస్సులతో నూతన బాధ్యతలు చేపట్టిన రాకేష్‌రెడ్డి, యువతను ఏకతాటిపైకి తీసుకువస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ, ప్రజలకు చేరువగా ఉండాలని సూచించారు. రాకేష్‌రెడ్డి నియామకానికి సంబంధించి క్షేత్రస్థాయిలో గ్రౌండ్ వర్క్ చేస్తూ తన వంతు కృషి చేసిన ఏపూరి తరుణ్‌ను సైతం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులు, కార్యకర్తల కృషి అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి..

# నవంబర్ 15 నాటికి వెలుగుమట్ల కాలనీ నిర్మాణాలు పూర్తి చేయాలి

**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్) :** వెలుగుమట్ల కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీలో చేపడుతున్న అన్ని మౌళిక వసతుల పనులను నవంబర్ 15వ తేదీ నాటికి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్తో కలిసి మంత్రి పరిశీలించి, మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి వెలుగుమట్ల కాలనీలో నిర్మాణం ప్రారంభించిన 300 ఇళ్లను నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నిర్మాణ స్థితిగతులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, పూర్తికావాల్సిన పనులు, పనుల పురోగతితో కూడిన నివేదికను ప్రత్యేకంగా సిద్ధం చేసి జిల్లా కలెక్టర్కు సమర్పించాలని సూచించారు. ప్రతి రోజూ పనులను పర్యవేక్షిస్తూ, ప్రతి మూడు రోజులకు ఒకసారి పురోగతి నివేదికను కలెక్టర్కు అందించాలన్నారు. అన్ని ఇళ్లను ఒకే నమూనాలో, ఆకర్షణీయంగా నిర్మించాలని, ఒకే రంగులో తీర్చిదిద్దాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పగలు, రాత్రి పనులు కొనసాగించాలని ఆదేశించారు. అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణం పూర్తి చేయాలని, విద్యుత్ పనులను కూడా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

**కాలనీలో అన్ని మౌళిక వసతులు ఒకేసారి పూర్తి చేయాలి**

ఇళ్ల నిర్మాణంతోపాటు రహదారులు, డ్రైనేజీలు, ఎనిమిది దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్, బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ కేంద్రం తదితర మౌళిక వసతుల పనులను కూడా నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అన్ని పనులను సమాంతరంగా చేపట్టాలని, ఏ పనిలోనూ జాప్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. కాలనీలోని ప్రతి ఇంటికి త్రాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి, ఇంటి వద్దనే త్రాగునీటి కుళాయి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీకి అవసరమైన రహదారులను నిర్మించాలని సూచించారు. మున్సిపల్ కమీషనర్ ప్రతి మూడు రోజులకు ఒకసారి కాలనీని సందర్శించి పనుల నాణ్యత, పురోగతిని స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలతో వెలుగుమట్ల కాలనీని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

**దీపావళి నాటికి సోలార్ రూఫ్టాప్ ప్యానెళ్ల ఏర్పాటు**

కాలనీలోని ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్టాప్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన అనుమతులను ఇంధన శాఖ కార్యదర్శి ద్వారా పొందేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నవంబర్ 8వ తేదీ దీపావళి నాటికి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా కాలనీ ప్రారంభోత్సవం:**

వెలుగుమట్ల కాలనీని డిసెంబర్ 9వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అప్పటికి కాలనీలోని అన్ని ఇళ్లు, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌళిక వసతులు అందుబాటులోకి రావాలని స్పష్టం చేశారు. కాలనీకి సంబంధించిన పేరును ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటిస్తారని తెలిపారు. గతంలో ఇక్కడ జరిగిన పరిణామాలను వివరిస్తూ, పేదల పేరుతో కొంత మంది భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని, కోర్టు నిర్ణయం ప్రకారం జిల్లా యంత్రాంగం ఆక్రమణలను తొలగించిందని మంత్రి పేర్కొన్నారు. అదే ప్రాంతంలో మోసపోయిన పేదలకు శాశ్వత నివాసాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు. పేదలకు న్యాయం చేస్తూ ఆదర్శ కాలనీగా, వెలుగుమట్ల కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కాలనీల్లో ఎలాంటి సౌకర్యాలు ఉంటాయో, అలాంటి సదుపాయాలన్నింటినీ వెలుగుమట్లలోని పేదలకు ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ఇళ్లతో పాటు రహదారులు, డ్రైనేజీలు, బస్తీ దవాఖానా, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం వెలుగుమట్లలో ఆదర్శవంతమైన కాలనీని నిర్మిస్తోందని అన్నారు. గతంలో జరిగిన దోపిడీని ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు.

**– పేదల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రాధాన్యం**

తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల స్థాయిపై ఆసక్తి వ్యక్తమవుతోందని, ఇటీవల తమిళనాడు పర్యటన సందర్భంగా అక్కడివారు తెలంగాణలో ఇన్ని సంక్షేమ పథకాలను ఎలా అమలు చేయగలుగుతున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. పేదల సంక్షేమాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకుని ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్ర సాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, దీపక్ చౌదరి, కమర్తపు మురళి, కిషోర్, సాధు, ఇతర ప్రజాప్ర తినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ వివక్షపై సమరం




**ఖమ్మం, అక్టోబర్ 19(మనం బ్యూరో):** ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయ వివక్షపై వామపక్షాలతో పాటు బిఆర్ఎస్ సమరానికి సిద్ధమయ్యాయి. ఈ నెల 22న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ (ఎంఎల్) మాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు ప్రకటించాయి. వామపక్షాలు బిఆర్ఎస్ నేతల సంయుక్త మీడియా సమావేశం సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఆయా పక్షాల బాధ్యులు మాట్లాడుతూ పేదవానికి దక్కాల్సిన ఇండ్ల రాజకీయ కారణాలతో అనర్హులకు లబ్ది చేకూరుతుందని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికకు సంబంధించిన నిబంధనలను గాలికి వదిలి చట్టబద్దత లేని ఇందిరమ్మ గ్రామ కమిటీల సిఫారసులను అమలు చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఉండటం లేదా ఆ పార్టీ జెండా కప్పుకుంటేనే ఇండ్లు కేటాయిస్తున్నారని అధికారులు కూడా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ కార్యాలయాల నుంచి వచ్చిన జాబితాను యథాతథంగా 'ఆమోదిస్తున్నారని వారు ఆరోపించారు. గత ప్రభుత్వం లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయించిందని కానీ ఇప్పుడు ఆ పద్ధతికి కాంగ్రెస్ –తిలోదకాలు ఇచ్చిందన్నారు. గ్రామల్లో సర్పంచుల హక్కులకు ఇందిరమ్మ కమిటీ తూట్లు పొడుస్తుందని దీనిని ప్రభుత్వం ప్రోత్సహించడం శోచనీయమన్నారు. రాజీవ్ గాంధీ హయాంలో జరిగిన 73, 74 రాజ్యాంగ సవరణకు ఇది పూర్తి విరుద్దమన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం పేదవాడు అర్హుడైతే రాజకీయ జోక్యం ఎందుకని విపక్షాల నేతలు ప్రశ్నించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన వాటికి బిల్లులు ఇవ్వకుండా నిలుపుదల చేశారని వాటికి వెంటనే బిల్లులు ఇవ్వాలన్నారు. అవకతవకలకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం చేయాలని ఇందుకు ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. చట్టబద్దత లేని ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని, సర్పంచులకు పేదల ఎంపిక బాధ్యతను అప్పగించి లబ్దిదారుల ఎంపికకు లాటరీ తీయాలని ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో నిబంధనలు పాటించాలని వారు –డిమాండ్ చేశారు. శాసనసభకు నిర్ణయాధికారం ఉంటుందని కానీ గ్రామ కమిటీలకు ఏమి నిర్ణయాధికారం ఉంటుందని వారు ప్రశ్నించారు. సర్పంచులు చేసిన గ్రామసభ తీర్మానాలకు అధికారులు విలువ ఇవ్వడం లేదని ఈ తీరు మార్చుకోవాలని వారు సూచించారు. 22న జరిగే మహాధర్నాలో సర్పంచులు, లబ్దిదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు, ఎంఎల్సి తాతామధు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య తదితరులు ప్రసంగించగా వివిధ పార్టీల నాయకులు యర్రాబాబు, మాదినేని రమేష్, బండి రమేష్, బెల్లం వేణుగోపాల్, ఆవుల అశోక్, లక్ష్మి నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి



**నీటిని పొదుపుగా వాడుకోవాలి**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఈర్లపూడి చెరువును పరిశీలన**

**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్) :** నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వాడుకోవాలని, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నాగార్జున సాగర్ జలాల ఆధారంగా, మంచుకొండ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే సమీప కాలంలో వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నందున నీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులోని నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ వాడుకోవాలని సూచించారు. రైతులు నీటి అవసరం చాలా తక్కువతో సాగయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరి, మొక్కజొన్న లాంటి పంటలు సాగుచేయవద్దని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, నీరు, కరంట్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి అన్నారు. ప్రజలకు, పశు పక్ష్యాదులకు త్రాగునీరు ఎంతో ముఖ్యమని, నీటిని, కరంట్ ను పొదుపుగా వాడుకోవాలని మంత్రి తెలిపారు. ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# జాతీయ ఆయుష్ మిషన్ క్రింద 7 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- **కలెక్టర్ దివాకర టిఎస్**
- **ఖమ్మం జిల్లాలో ఆయుష్ విభాగంలో వివిధ పోస్టుల భర్తీ**
- **అక్టోబర్ 26 వరకు దరఖాస్తుల స్వీకరణ**
- **దరఖాస్తులను ఐడీఓసీ ఇన్‌వార్డ్ సెక్షన్‌లో అందజేయాలి**

**ఖమ్మం, అక్టోబర్19(మనం న్యూస్) :** ఖమ్మం జిల్లాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో జాతీయ ఆయుష్ మిషన్ క్రింద పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్స్ నిర్వహణకు వివిధ పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 7 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టు ఒకటి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు మూడు, డైటీషియన్ పోస్టు ఒకటి, సైకోసోషల్ కౌన్సెలర్ పోస్టు ఒకటి, యోగా ప్రొఫెషనల్ పోస్టు ఒకటి ఉన్నాయని తెలిపారు. పోస్టులను బట్టి నెలకు రూ. 60,000 చొప్పున పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్‌కు, రూ. 40,000 చొప్పున ఆయుష్ మెడికల్ ఆఫీసర్‌కు, రూ. 20,000 చొప్పున డైటీషియన్‌కు, రూ. 28,000 చొప్పున యోగా ప్రొఫెషనల్‌కు వేతనం చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సైకోసోషల్ కౌన్సెలర్‌కు ఒక్కో సెషన్‌కు రూ. 500 చొప్పున చెల్లిసారని, సంవత్సరానికి కనీసం 200 విజిట్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఆయుర్వేద, యునాని, హోమియోపతి లేదా నాచురోపతిలో పీజీ డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు సంబంధిత ఆయుష్ వైద్య విధానంలో డిగ్రీతో పాటు నాలుగున్నర సంవత్సరాల కోర్సు, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, డైటీషియన్ పోస్టుకు బి.ఎస్సీ న్యూట్రిషన్ డిగ్రీ, సైకోసోషల్ కౌన్సెలర్ పోస్టుకు మాస్టర్ ఇన్ సోషల్ వర్క్‌పీజీ డిగ్రీ ఉండాలని తెలిపారు. యోగా ప్రొఫెషనల్ పోస్టుకు నాచురోపతిలో డిగ్రీ లేదా నాచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా కలిగి ఉండాలని పేర్కొన్నారు. తేదీ: 01.07.2026 నాటికి అభ్యర్థుల కనీస వయస్సు 18 సంవత్సరాలు, గరిష్ఠ వయస్సు 44 సంవత్సరాలు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగ అభ్యర్థులకు పది సంవత్సరాల వయో పరిమితి సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. అర్హత పరీక్షలో సాధించిన మార్కులకు 90 శాతం వెయిటేజీ, వయస్సు ఆధారంగా మరో 10 మార్కులు కేటాయించి మెరిట్ జాబితా రూపొందిస్తారని తెలిపారు. రోస్టర్ పాయింట్లకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఓపెన్ కేటగిరీ రోస్టర్ పాయింట్ కేటాయించినట్లు తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ మూడు పోస్టులకు వరుసగా ఓపెన్ కేటగిరీ , ఎస్సీ గ్రూప్-2 , ఓపెన్ కేటగిరీ రోస్టర్ పాయింట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. డైటీషియన్, సైకోసోషల్ కౌన్సెలర్, యోగా ప్రొఫెషనల్ పోస్టులకు ఒక్కొక్కటి చొప్పున ఓపెన్ కేటగిరీ రోస్టర్ పాయింట్ కేటాయించినట్లు తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఆయా పోస్టులకు కేటాయించిన రోస్టర్ పాయింట్లకు అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థుల నుంచి అక్టోబర్ 26 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఖమ్మం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని ఇన్వర్డ్ సెక్షన్‌లో అందజేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు, ఇతర వివరాలు జిల్లా అధికారిక వెబ్‌సైట్ న్త్ఝుఎఝుఫ్.వశ్రీఖఅ-స్త్రుఖు.స్త్రశీజ.ఱఅ లో అందుబాటులో ఉంచినట్లు మరిన్ని వివరాల కోసం ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ పద్మావతి సెల్ నంబర్ 9247829717నులి సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## 22న పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

**కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్)** : అక్టోబర్ 22న (గురువారం) ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమం నిర్వహించి, వారి చిత్ర పటానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘ నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు : శెట్టి



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్) :** ఖమ్మం జిల్లా సోదరలకు సోదరీమణులకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయ దశమి అందరికి మరిన్ని విజయాలు చేకూర్చాలని, అమ్మవారి కటాక్షం ఉండాలని జిల్లా ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అందరికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మనం



# ఖమ్మం

**ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాధపాలెం**

## ప్రజాదివాస్‌లో ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్) :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన పలువురు బాధితులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అంద జేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధి తులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

## ప్రతి ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకోవాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ**

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్**



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్) :** ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. రఘునాథ పాలెం మండలం బూడిదెంపాడు గ్రామానికి చెందిన కే సంపత్ కుమార్, తన భార్య బానోతు సోనాలీ పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర గ్రామానికి పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తూ జూన్ 9 2025న రోడ్డు ప్రమాదంలో మరణించారని, ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెన్షన్, ఇన్సూరెన్స్ డబ్బులు ఇంకా అందలేదని, తమ చెల్లింపులకు సంబంధించిన ఫైలు ఎంపీడీవో కార్యాలయం నుంచి పంపలేదని తెలిసిందని, తమకు కారుణ్య నియామకం కూడా ఇంకా కాలేదని తమ పరిస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు అదేవిధంగా కారుణ్య నియమాకం అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం బుర్హాన్ పురంకు చెందిన క్షత్రివాణి బాయి సర్వేనెంబర్ 4/అ/1/1/2 లో గల బోరుబావి మీటర్ తన తండ్రి పేరు మీద ఉందని ఆ భూమి తనకు రిజిస్ట్రేషన్ చేశారని తన తండ్రి మరణించారని, మీటర్ పేరు మార్చాలని అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదని, విద్యుత్ మీటర్ తన పేరుకు మార్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఎన్పీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారికి రాస్తూ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదుపు కలెక్టర్ ఆదేశించారు. రఘునాధపాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి చెందిన కృష్ణయ్య, తనకు గ్రామంలో 700 చదరపు గజముల స్థలం ఉందని, అందులో తన ఇద్దరు కుమారులు ఇండ్లు నిర్మించుకున్నారని, తన కుమారులు తనను చూడటం లేదని, తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

## గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఇళ్ల పట్టాల పంపిణీ ఎలా

### గ్రామ సభ తీర్మానం లేని ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు రద్దు చేయాలి

### టీ డబ్ల్యూ ఎం ఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి



**కూసుమంచి, అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** కూసుమంచి మండల కేంద్రంలో క్యాంప్ కార్యాలయం లో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ పైన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాము అని బిజెపి జిల్లా నేత టి డబ్ల్యూ ఎం ఎఫ్ జిల్లా ఇన్చార్జి గుండా ఉపేందర్ రెడ్డి ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు, పత్రికా ప్రకటనలు ఆయన ఈ విధంగా తెలియజేస్తూ. కనీసం గ్రామ సభ తీర్మానం లేకుండా ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో హడావుడి చేయడం హాస్యాస్పదం. కనీసం గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా హడావుడి ఎందుకో మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. అసలు మనం రాజ్యంగా బద్దంగా ఎన్నికైన ప్రజాస్వామ్యం లో ఉన్నామా అని అనుమానం కలుగుతుంది. స్థానిక సంస్థల ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఎల్ ఓ పి నేత చెప్పే రాజ్యాంగం ఇదేనా, నీతులు ఎదుటి వారికి మాత్రమే కానీ మాకు కాదు అన్నట్లు ఉంది ప్రభుత్వం తీరు. మండల కేంద్రంలో యే ఒక్క గ్రామ పంచాయతీ లో ఐన తీర్మానం జరిగిందా, కనీసం వార్డు సభ్యులకు కూడా సమాచారం లేకుండా ఇళ్ల పట్టాల పంపిణీ చేయడం దుర్మార్గం. ఇట్టి చర్యను తెలంగాణ వార్డు మెంబెర్స్ ఫోరం జిల్లా తరపున ఖండిస్తున్నాం. వెంటనే ఇళ్ల పట్టాల పంపిణీ నిలిపివేసి, పాలక మండలి సభ్యులు తీర్మానం మరియు గ్రామ సభ లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని పత్రికా ప్రకటనలో తెలిపారు.

## లింగరాం తండాలో యువరైతు బానోతు అజయ్ కుమార్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి





**కూసుమంచి, అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, లింగారం తండా గ్రామంలో సోమవారం నాడు బానోతు అజయ్ కుమార్ (19 ) సంవత్సరాలు ప్రమాదవశాత్తు పొలం దగ్గర గల వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన విషాద సంఘటన చోటుచే సుకుంది, మృతిని తల్లి బానోతు వనిత కూసుమంచి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వివరాల ప్రకారం, తన పెద్ద కుమారుడు బానోతు అజయ్ కుమార్, మరియు తన చిన్న కుమారుడు భానోతు చంటిలు సోమవారం ఉదయం 9 గంటల 20 నిమిషాల ప్రాంతంలో వారికి గల వరి పొలానికి నీళ్లు పెట్టడం కోసం బావి దగ్గరకు వెళ్ళినారని, బావి దగ్గర కరెంటు మోటార్ వేయడం కోసం వెల్లినవారు తాడు సహాయంతో బావిలోకి దిగి మోటర్ వేసే క్రమంలో తాడుజారి భానోత్ అజయ్ కుమార్ బావిలో పడి మృతి చెందినట్లుగా కూసుమంచి పోలీస్ స్టేషన్లో సోమవారం నాడు ఫిర్యాదు చేసినారు, ఫిర్యాదు అందుకున్న కూసుమంచి పోలీసులు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని బావిలో నుండి మృతుడిని తీసి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగినది, అనంతరం కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ సతీష్ మీడియాకు తెలిపారు, దసరా పండుగ ముందు రోజే బానోత్ అజయ్ కుమార్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందడంతో లింగరం తండాలో విషాదఛాయలలు ముకున్నాయి, గ్రామం మొత్తం లబోదిబోమని ఏడుస్తూ తమ యొక్క బాధను వ్యక్తం చేసినారు. విషయం తెలుసుకున్న మండలంలో గల వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మృతిని కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేసినారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



- మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాల అమలు ఆగదు
- కూసుమంచి క్యాంప్ ఆఫీస్ వద్ద కూసుమంచి మండల రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చేసిన మంత్రి

**కూసుమంచి, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ ల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలం ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నవరాత్రులలో అమ్మ వారిని నిష్టతో పూజించి, మనసులోని కోరిక లన్నీ విజయదసరి రోజున అమ్మవారు తీర్చాలని మనస్పూర్తిగా కోరుకుంటు న్నానన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బొమ్మలు చూపించి, సినిమాటిక్ గా ప్రకటనలు చేసి మోసం చేసిన ప్రభుత్వా లలా కాకుండా, అర్హులైన పేదవాడెవరూ నష్టపోకుండా ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలనేదే ప్రజా ప్రభుత్వ ధ్యేయ మని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడ తలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళు మంజూరు చేయడమే కాకుండా, హైదరా బాద్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. గ్రామీణ, తండా ప్రాంతాల్లో కూడా విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామ న్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 30 వేల నుంచి 2 లక్షల 40 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇంకా ఎంత ఖర్చయినా మూడో, నాలుగో విడతల్లో ఇళ్లు కట్టిస్తామని, అర్హులందరికీ అందజేస్తామని మంత్రి అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుందని మంత్రి అన్నారు. ప్రతిపక్ష శాసనసభ్యుల నియోజ కవర్గాల్లో కూడా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ. 500 లు సన్నబియ్యానికి బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు భీమా అంది స్తున్నామని, మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, మరో 14,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చా మని, త్వరలో మరిన్ని ఇవ్వబోతున్నామని తెలిపారు. గత 33 నెలల్లోనే కేవలం మహి ళా సంఘాలకు రూ. 73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామన్నారు. పేదవాడి కష్టం తెలిసిన మన ప్రభుత్వం, పేదవాడి ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేస్తూ, రాష్ట్ర ప్రజలం దరికీ మంత్రి దసరా శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహశీల్దార్ సైదులు, హౌజింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





# కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

- కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలి
- కేజీకేఎస్ 69వ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ డిమాండ్



**కూసుమంచి, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కా రానికి పోరాటమే మార్గమని కల్లుగీత కార్మి క సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ అన్నారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో కేజీకేఎస్ 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం మండల కార్యదర్శి మంద నాగేశ్వ రరావు, పెద్ద గౌడ్ అర్వపల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ఆయన జెండాను ఆవిష్కరించారు. 1957 అక్టోబర్ 19న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్లలో ఏర్పడిన కల్లుగీత కార్మిక సంఘం అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధిం చిందని తెలిపారు. అయినప్పటికీ గీత కార్మికుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, ప్రభుత్వాలు వారి సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శిం చారు. రాష్ట్ర బడ్జెట్‌లో కల్లుగీత కార్పొరే షన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించాలని, గీత కార్మికుల పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచాలని, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన గీత కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా పింఛన్ మంజూరు చేయాలని కోరారు. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, నంద నవనం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ప్రారంభించాలని, నెక్లెస్ రోడ్డులో మూసి వేసిన నీరా కేఫ్‌ను వెంటనే తెరవాలని అన్నారు. కల్లుగీత సొసైటీలను బలోపేతం చేసి క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వ హించాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహ నాలు అందించాలని కోరారు. ఏజెన్సీ ప్రాం తాల్లో సొసైటీలను పునరుద్ధరించి, గీత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలాంటి షరతులు లేకుండా వర్తింపజే యాలని సూచించారు. కల్లులోని పోష కాలు, ఔషధ గుణాలపై ప్రభుత్వమే ప్రచారం చేయాలని, మద్యం దుకాణాల్లో 25 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసి ఆ అవకాశాన్ని సొసైటీలకే కల్పించాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులను అరిక ట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బొల్లికొండ పాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి మల్ల వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి బోడపట్ల శ్రీను, అర్వపల్లి వెంకటేశ్వర్లు, అర్వపల్లివెంకన్న, ఆర్వపల్లి పెద్ద వెంకటేశ్వర్లు, అర్వపల్లి కృష్ణమూర్తి, మంద రాంబాబు, పరసగాని వీరబాబు, మంద నాగేశ్వరరావు, ఆర్వపల్లి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి రూ.5 కోట్లతో హాస్టళ్లు



- బాలుర హాస్టల్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 7 నుంచి 8 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తాం..
- బాలికల హాస్టల్ పనులూ త్వరలో ప్రారంభం

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించి, ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ 22వ వార్డులో రూ.2.5 కోట్లతో నిర్మించనున్న గిరిజన బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్ భవనానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు 150 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని, రాబోయే 7 నుంచి 8 నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

**బాలికల హాస్టల్‌కు మరో రూ.2.5 కోట్లు**

గిరిజన బాలికల విద్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి పేర్కొన్నారు. బాలికల హాస్టల్ నిర్మాణానికి మరో రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రెండు హాస్టళ్ల నిర్మాణాలకు కలిపి రూ.5 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా సుమారు 300 మంది గిరిజన బాలబాలికలకు వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. దూర ప్రాంతాల నుంచి ఉన్నత విద్య కోసం వచ్చే విద్యార్థులకు వసతి సమస్యలు తగ్గి, చదువుపై శ్రద్ధ పెట్టేందుకు హాస్టళ్లు ఉపయోగపడనున్నాయి.

**అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం**

ప్రజా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలతోపాటు పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని వివరించారు. రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, సన్నధాన్యం సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోనూ అభివృద్ధి పనులను కొనసాగిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు**

అనంతరం ముత్తగూడెం గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టి.ఎస్, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వినయేందర్‌రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ జి.పి వెంకటరెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.





# తిమ్మకపేట మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



- రూ.4.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నూతన పైపులైన్ ఏర్పాటు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మండల కాంగ్రెస్ నాయకులు పత్తి నాగేశ్వరరావు

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండల పరిధిలోని తిమ్మకపేట గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామ ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరా అందించాలనే లక్ష్యంతో ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా సుమారు రూ.4 లక్షల 50 వేల వ్యయంతో నూతన పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. మంచినీటి బావి నుంచి గ్రామంలోని మంచినీటి ట్యాంకు వరకు పైపులైన్ నిర్మాణం చేపట్టి, నేడు ప్రారంభించినట్లు మండల కాంగ్రెస్ నాయకులు పత్తి నాగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గుర్తించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు పత్తి నాగేశ్వరరావు ఈ విషయాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామసాయం నరేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గ్రామ ప్రజల ఇబ్బందులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో, సమస్య పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నూతన పైపులైన్ ఏర్పాటు ద్వారా గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగి, మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కనీస అవసరాలను గుర్తించి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామసాయం నరేష్ రెడ్డికి గ్రామ ప్రజల తరఫున పత్తి నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేపాకుల సుభద్ర, ఉపసర్పంచ్ దుబాకుల పిచ్చయ్య, సుంచు ఆశీర్వాదం, చుంచు కోటయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఇంద్రావతి తదితరులు పాల్గొన్నారు.



## పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

### బతుకమ్మ వేడుకల్లో విషాదం గుండెపోటుతో మహిళ మృతి



**నేలకొండపల్లి, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** నేలకొండపల్లి మండలంలోని చెరువు మాదారం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన బతుకమ్మ వేడుకల్లో విషాద ఘటన జరిగింది. మండలంలోని అప్పలనరసింహపురం గ్రామానికి చెందిన మహిళ ఎలగాల భారతి(50) చెరువుమాదారంలో బంధువుల ఇంటికి వెళ్ళింది. గ్రామంలో బతుకమ్మ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే వద్ద తోటి బంధువులు, మిత్రులతో కలిసి నృత్యం చేస్తుండగా గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పు కూలిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహాన్నదాన కార్యక్రమం

**ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి**



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామంలో చన్నీళ్ల ఎల్లయ్య స్వస్థలంలో శ్రీ కనకదుర్గమాత ఆధ్వర్యంలో నిర్వహించిన మహాన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుం బూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో నిర్వహించిన అమ్మవారి వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు..భక్తి, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా జరిగిన ఈ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పోలేపల్లి సర్పంచ్ బత్తిని మహేష్, ఉపసర్పంచ్ చల్ల లక్ష్మణ్, యలమద్ది శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, గోళ్లపాడు మాజీ సర్పంచ్ మద్ది వీరారెడ్డి, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ పంతులు నాయక్, కాంగ్రెస్ యువ నాయకుడు బత్తుల నరేష్, సీనియర్ నాయకులు ఆడెపు ఆంజనేయులు, బత్తుల వెంకన్న, చన్నీళ్ల వెంకటేష్, గూడ బ్రహం, తాళ్లపల్లి నవీన్, బత్తుల కిరణ్, గార్ల వెంకట్ నారాయణ, గార్ల శేఖర్, గార్ల సతీష్, మద్దెల సుందర్, బాలు, చన్నీళ్ల ఉపేందర్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### ఏదులాపురం మున్సిపాలిటీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బానోత్ కిషన్ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 19(మనం న్యూస్) :** ఏదులాపురం మున్సిపాలిటీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్ బానోత్ కిషన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఆశీస్సులతో కిషన్ నాయక్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించాలని కోరారు. నూతన ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన బానోత్ కిషన్ నాయక్ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

# వైన్‌షాపులో నిల్.. బెల్ట్‌షాపులో ఫుల్!

**– రూ.190 బీరు రూ.230--240కు విక్రయం?**

**– ధరల నియంత్రణ ఏదీ.. పర్యవేక్షణ ఏదీ?**








**కొణిజర్ల,అక్టోబర్19(మనం న్యూస్):** మండల కేంద్రంలోని వైన్‌షాపుల్లో కొన్ని రకాల మద్యం, కింగ్‌ఫిషర్ బీరు అందుబాటులో ఉండటం లేదని, అదే సమయంలో గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో మాత్రం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. వైన్‌షాపుల్లో దొరకని మద్యం బెల్ట్‌షాపుల్లో ఎలా లభిస్తోందని, ఆయా విక్రయ కేంద్రాలకు మద్యం నిల్వలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు.

**రూ.190 బీరు రూ.230 నుంచి రూ.240 వరకు?**

కింగ్‌ఫిషర్ బీరు ధర రూ.190 ఉండగా, కొన్ని బెల్ట్‌షాపుల్లో రూ.230 నుంచి రూ.240 వరకు విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. నిర్ణీత ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నా నియంత్రించే వారు లేరా? వినియోగదారుల నుంచి అదనపు ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అయితే, ఈ ధరల వ్యత్యాసంపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

**గ్రామాల్లో బెల్ట్‌షాపుల జోరు.. పర్యవేక్షణ ఏదీ?**

మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయని, అక్కడ మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. ఈ దుకాణాలకు మద్యం ఎక్కడి నుంచి సంఫరా అవుతోంది? వైన్‌షాపుల నుంచి నిల్వలు తరలిస్తున్నారా? ఈ వి క్రయ కేంద్రాలకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? అనే అం శాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతున్నారు.మద్యం నిల్వలు, సరఫరా, విక్రయ ధరలు, అనధికార విక్రయ కేంద్రాలపై పర్యవేక్షణ నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉందని పలువురు పేర్కొంటున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యం లో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? అది ్క ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ధరల నియంత్రణతో పా టు మద్యం సరఫరా వ్యవస్థపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

**స్పందించని ఎక్సైజ్ అధికారి.....**

బెల్ట్‌షాపుల నిర్వహణ, మద్యం విక్రయాల్లో ధరల వ్యత్యాసాలు, అది కారుల పర్యవేక్షణ తదితర అంశాలపై వివరణ కోరేందుకు సంబం ధిత ఎక్సైజ్ అధికారిని సంప్రదించగా స్పందించలేదు. వైన్‌షాపుల్లో మద్యం లభ్యత, బెల్ట్‌షాపుల్లో విక్రయాలు, ధరల వ్యత్యాసాలపై వచ్చి న ఆరోపణలను సంబంధిత అధికారులు పరిశీలించాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.వైన్‌షాపుల్లో నిల్.. బెల్ట్‌షాపుల్లో ఫుల్.. అయినా పర్యవేక్షణ ఎక్కడ? అన్న ప్రశ్న మండలంలో చర్చనీయాంశంగా మారిందని మద్యం ప్రియులు పేర్కొంటున్నారు.

## ఉద్యమకారులకు వైరాలోనే ఇంటి స్థలాలు కేటాయించాలి

**– ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం**




**వైరా, అక్టోబర్ 19 (మనం న్యూస్):** తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులకు ప్రభుత్వం కేటాయించే 250 గజాల ఇంటి స్థలాలను వైరా మున్సిపాలిటీ పరిధిలోనే ఒకే చోట కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వైరా ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల తహసీల్దార్ సురేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల కమిటీ అధ్యక్షుడు షేక్ పాషా మాట్లాడుతూ, వైరా మండలంలోని తెలంగాణ ఉద్యమకారులందరికీ మున్సిపాలిటీ పరిధిలోనే ఇంటి స్థలాలు కేటాయించి, ఆ ప్రాంతానికి 'తెలంగాణ ఉద్యమకారుల గృహ సముదాయం' అని పేరు పెట్టేలా ప్రభుత్వానికి ప్రతిపాదించాలని కోరారు.అలాగే ప్రతి ఉద్యమకారుడికి రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఉచిత విద్యుత్ కనెక్షన్ సైతం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో , ఉపాధ్యక్షుడు న్యాయవాది సంపసాల వరదరాజు, ప్రధాన కార్యదర్శి దొంత నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్ షేక్ నాగుల్ మీరా, యామాల గోపాల్‌రావు, కంపల నాగేశ్వరరావు, షేక్ లాల్ మియా, కుదురుపాక దర్గయ్య, మేరుగు కృష్ణ అల్లు బుజ్జి బాబు, ముత్తవరపు నాగార్జున, మేడి రమేష్, కన్నెగంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## కరువు కోరల్లో కొణిజర్ల..

**– కరువు మండలంగా ప్రకటించాలి**

**– ఆదుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్**



**కొణిజర్ల,అక్టోబర్ 19 (మనం న్యూస్):**కొణిజర్ల మండలాన్ని తక్ష ణమే కరువు మండలంగా ప్రకటిం చి రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎం) మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు నా యకులు మండల ప్రత్యేక అధికారి కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకు లు కొప్పుల కృష్ణయ్య, తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిన్నదని తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేసినప్పటికీ, ఆశించిన దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపో యారని పేర్కొన్నారు. పత్తికి పూత, కాపు సరిగా లేక ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రెండో పంటగా వరి సాగు చేయడానికి సాగునీరు అందుబాటులో లేకపోవడంతో సుమారు వెయ్యి ఎకరాల్లో మాత్రమే బోర్ల కింద నాట్లు వేసినట్లు తెలిపారు. వర్షాలు లేక మొక్కజొన్న సాగు చేపట్టలేదని, చెరువు లు, కుంటల కింద కూడా వరి నాట్లు పడలేదని వివరించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి కొణిజర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) మండల నాయకులు బోయినపల్లి శ్రీనివాసరావు, తాత వెంకయ్య, లింగాల డేవిడ్ విజయ్ రాజు, ప్రకాశం, వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వైరాను కరువు మండలంగా ప్రకటించాలి

**– పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలి.. భుక్య వీరభద్రం**



**వైరా, అక్టోబర్ 19(మనం న్యూస్):** వైరా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం నాయకుడు భుక్య వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వైరా ప్రజావాణిలో స్థానిక తహసీల్దార్ సీహెచ్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా భుక్య వీరభద్రం మాట్లాడుతూ, వైరా సాగునీటి ప్రాజెక్టు ఉందనే కారణంతో మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం సరి కాదన్నారు. వర్షాలు సరిగా కురవకపోవడంతో సోమవరం నల్లచెరువు నిండక దాదాపు 100 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేపట్టలేదని తెలిపారు.ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుతుందో లేదోనన్న సందిగ్ధతతో రైతులు ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్ 15 వరకు ఆలస్యంగా వరి నాట్లు, విత్తనాలు వేసుకున్నారని పేర్కొన్నారు. సన్న రకాలపై బోనస్ వస్తుందనే ఆశతో ఎక్కువ మంది రైతులు వాటినే సాగు చేశారని తెలిపారు.

**పేదలకు ఉపాధి, నిత్యావసర సరుకులు అందించాలి**

కరువు ప్రభావం వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలపై తీవ్రంగా ఉంటుందని భుక్య వీరభద్రం పేర్కొన్నారు. వైరా మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలతో పాటు పట్టణంలోని పేదలకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, రైతు సంఘం పట్టణ కార్యదర్శి కొంగర సుధాకర్, తుమ్ సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల రజిత, బాజోజి రమణ, కిలారి శ్రీనివాసరావు, ఎస్.కె. నాగుల్ పాషా, కారుమంచి జయరాజు, ముత్తమాల విజయరాజు, వెదుల పుల్లయ్య, రుద్రాక్షల వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## మీడియాకు ఎమ్మెల్యే దసరా శుభాకాంక్షలు



**వైరా, అక్టోబర్ 19 (మనం న్యూస్):** వైరా నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, పాత్రికేయ మిత్రులకు, వారి కుటుంబ సభ్యులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో పాత్రికే యుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమం, వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి దిశగా పాత్రికేయుల కలం మరింత పదునుగా, ప్రసారాలు మరింత బాధ్యతాయుతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# నా బిడ్డను బ్రతికించండి..





**- జనరిక్ సమస్యలతో ఆసుపత్రిలో రెండు నెలల చిన్నారి**
**- ఇప్పటికే వైద్యం కోసం 12 లక్షల ఖర్చు**
**- ఇంకా 10 లక్షలు అవుతుందన్న వైద్యులు**
**- ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న తల్లి సైదమ్మ**
**- దాతలు ఎవరైనా సహాయం చేసి నా బిడ్డను కాపాడండంటూ వేడుకోలు**

**బోనకల్, అక్టోబర్ 19 ( మనం న్యూస్):** బిడ్డకు జన్మనివ్వక ముందు నుంచే తల్లి బిడ్డ క్షేమానికి పరితపిస్తుంది. పుట్టిన క్షణం నుంచి వారిని కంటికి రెప్పలా చూసుకుంటుంది. ఆ బిడ్డకు మంచి భవిష్యత్తును అందించేందుకు తల్లి తండ్రి ఇద్దరు ఎంతటి కష్టాన్నైనా భరిస్తారు. తన బిడ్డ ఎంతో ప్రయోజకులయ్యేందుకు శ్రమిస్తుంటారు. కానీ ఓ తల్లికి ఆ పేగు బంధం తీరని ఆపదలో పడేసింది. మండల పరిధిలోని రావినూతల గ్రామ తూర్పు తండాకు చెందిన లావూరి సైదమ్మ హనుమంతు దంపతుల 2 నెలల పసిబిడ్డ జన్యు లోపం కారణంగా హైదరాబాద్ రెయిన్బో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. క్రోమోజోమ్ 15 లోపంతో జన్యుపరమైన రుగ్మతతో బాధపడుతున్నాడు. ఇప్పటికే వైద్య ఖర్చులు 12 లక్షల వరకు అయినది. బిడ్డను బ్రతికించటం కోసం ఆ తల్లి పడుతున్న తపన చూస్తుంటే పలువురిని కంటతడి పెట్టిస్తుంది. ఇంకా వైద్యం కోసం 10 లక్షలు అవుతుందని వైద్యులు అనడంతో తల్లి సైదమ్మ దిక్కు తోచని స్థితిలో ఉన్నది. అసలే వారిది నిరుపేద కుటుంబం. ఇప్పటికే తన బిడ్డను బతికిం చడం కోసం అప్పులు చేసి 12 లక్షలు ఖర్చు చేసింది. ఇప్పుడు వైద్య ం చేయించలేని దుస్థితిలో ఉన్నది. బిడ్డ నిస్సహాయ స్థితిలో ఉండి కళ్ళముందే కుంగిపోతుంటే చూస్తూ ఏమి చేయలేని ఆ తల్లి సైదమ్మ అనుక్షణం కన్నీరు మున్నీరు అవుతుంది. ఇది ప్రాడర్ - విల్లి సింద్రోమ్ లేదా ఏంజెల్ మాన్ సింద్రోమ్ అని హైదరాబాద్ రెయిన్బో హాస్పిటల్ వైద్యులు అనుమానిస్తున్నారు. బిడ్డకు నిరంతరం వైద్య సంరక్షణ, చికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. దీనితో ఆ తల్లి పేగు బంధం కోసం మరింత తపన పడుతుంది. అమ్మ ఒడిలో ఉండాల్సిన బిడ్డ ఆస్పత్రిలో పోరాడుతున్నాడు. తన బిడ్డ కోసం ఎవరైనా దాతలు సహాయం ఇస్తారేమోనని దీనంగా ఎదురు చూస్తుంది. నా బిడ్డను కాపాడండి అంటూ వేడుకుంటుంది. ఈ పసిగందును చూసి మానవతా దృక్పథంతో ఎవరికి తోచిన అంత వారు ఆర్థిక సహాయం చేసి ఒక నిండు ప్రాణాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# అన్నదానం ప్రారంభించిన చైర్ పర్సన్ సుజాత



**మధిర, అక్టోబర్ 19(మనం న్యూస్):** మధిర అంబేద్కర్ సెంటర్ దగ్గర్లో గల వసుధా అపార్ట్మెంట్ లో కాంగ్రెస్ నాయకుడు కర్లపూడి వాసు నెలకొల్పిన శ్రీ దుర్గామాత అమ్మవారిని మధిర మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం దర్శించుకున్నారు. నవరాత్రు ల సందర్భంగా కర్లపూడి వాసు అమ్మవారిని నెలకొల్పి, భక్తులందరూ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవటం సంతోషకరమని, దుర్గా అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు అందరిపై వుండాలని ఆకాంక్షిం చారు. అనంతరం వాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్య క్రమాన్ని చైర్మన్ సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు సా మినేని రామనాథం, మి రి యాల రమణగుప్తా, చెరుకూ రు నాగార్జున, తెలుగుదేశం పార్టీ నాయ కులు వేమూరి సునీల్, చె రుకూరి కృష్ణారావు, వ్యా పారవేత్త మందడ పు శ్రీని వాసరావు, బోణాల శంకరాచారి పాల్గొన్నారు.

# చింతకాని సద్దుల బతుకమ్మ సంబరాలలో జననిరాజనం.



**- తీరొక్క పూలతో సద్దుల బతుకమ్మ సంబరాలు**
**- సందడి వాతావరణంలో చింతకాని గ్రామం**
**- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు**

**మధిర, అక్టోబర్ 19 (మనం న్యూస్):** చింతకాని గ్రామ రామాలయం సెంటర్ దగ్గరలో ఉన్న కనకదుర్గ అమ్మవారి వద్ద ఉన్న బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. బతుకమ్మ సంబరాలు చివరి రోజు కావడంతో చింతకానిలో మహిళలు భారీగా తిరొక్క పూలతో బతుకమ్మలు తీసుకొని వచ్చి ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు. ఈ కార్యక్రమంలో కిలారు జగన్ మోహనరావు,ఉప సర్పంచ్ దంపతులు కోలా ఉమారాణి నాగేశ్వరావు, విగ్రహ దాత బండి రమణ,స్థలదాత వెన్నబోయిన రాజు వార్డు మెంబర్లు కిలారు బాబురావు, షేక్ రహీమ్ తుల్లా, పొనుగోటి బాబు గంధసిరి లలిత,వేముల ఆకాష్,నాయకులు బండి ప్రసాద్, మల్లెల సత్యనారాయణ,షేక్ జానీమియా,బండి వెంకటేశ్వర్లు కొలుకుల వెంక టేశ్వర్లు, కానగాని బుచ్చయ్య, పొనుగోటి ప్రసాద్, పొనుగోటి చిన్న రత్నాకర్, జక్కి వీరబాబు, గంధసిరి శ్రీను,గడ్డం వెంకటేశ్వర్లు, కూచిపూడి సతీష్, బచ్చు బాబు,చింతల సైదులు,కొడవకంటి మోహన్ రావు, మేకనబోయిన రాంబాబు, ఉమారాజు పోతురాజు గోపాల్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మల్లు భట్టి విక్రమార్క కృషి పట్టుదలతో మూడవ జోన్ ఎన్ఎస్పీ కాలువకు గోదావరి జలాలు






**ఎర్రుపాలెం,అక్టోబర్ 19 (మనం న్యూస్):** మన ప్రాంత ప్రజలందరికీ ఎంతో సంతోషకరమైన గర్వకారణమైన విషయం ఈ నిర్ణయం మన ప్రాంత రైతాంగానికి కొత్త ఆశలను చిగురింపజేస్తూ వ్యవసాయ రంగానికి మరింత భరోసానిచ్చే గొప్ప ముందడుగుగా నిలుస్తుంది సాగునీటి లభ్యత పెరగడం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరడంతో పాటు పంటల సాగు విస్తీర్ణం పెరిగి వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేందుకు దోహదపడుతుందిజై జవాన్ జై కిసాన్ జై తెలంగాణ వెంకటాపురం సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి..

# మనం



# మధిర

**మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ**

# డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కని కలిసిన గ్రామ ఉప సర్పంచ్



**ఎర్రుపాలెం,అక్టోబర్ 19 (మనం న్యూస్):** డిప్యూటీ సీఎంని మర్యాదపూర్వకంగా బనిగండ్లపాడు గ్రామం ఉప సర్పంచ్ వేమిరెడ్డి రామి రెడ్డి కలిశారు. గ్రామంలో వివిధ డ్రైనేజీ లనులు డోక్రా మహిళలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కి సంబం ధించిన షెల్టర్ మహిళలకు కుట్టు మిషన్లు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. సానుకూలంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.స్పందించారు.

# వాహనదారులు నిబంధనలను పాటించాలి

**- బోనకల్ ఎస్ఐ మాచినేని రవి**



**బోనకల్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని బోనకల్ ఎస్సై మాచినేని రవి అన్నారు. సోమ వారం మండల కేంద్రంలో స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్ నందు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాచనేని రవి మాట్లాడుతూ... ఈ తనిఖీలు వాహనదారులు రోడ్డు భద్రతను కాపాడేందుకు, నిబంధనల ఉల్లంఘనను గుర్తించేందుకు చేపట్టడం జరిగిందని అన్నారు. వాహనాలకు సరైన పత్రాలు ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రహదారి నియమాలు తప్పనిసరిగా పాటించాలని, వాహనదారుడు అతి వేగంగా వెళ్లరాదని, వాహనాలకు సరైన పత్రాలు తమ వెంటే ఉంచుకోవాలని , సరైన పత్రాలు లేకుంటే జరిమానా విధించబడుతుందని సూచించారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, పోలీసు వారి నిబంధనలు ఉల్లంఘించి మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు పోలీసు వారికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జమలాపురం చెరువుకు గోదావరి జలాలు సర్పంచ్ ఆధ్వర్యంలో జలహారతులు





**ఎర్రుపాలెం,అక్టోబర్ 19(మనం న్యూస్):** మండల పరిధిలోని జమలాపురం పెద్ద చెరువు కు గోదావరి జలాలు సోమవారం చేరుకున్నా యి.గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మల కుమారి ఖమ్మం కెఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు దంపతులు గ్రామస్తులతో కలిసి జల హారతులు ఇచ్చి అర్చకులతో కలసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆ నీటిని జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తీసుకొని వెళ్లి స్వామి వారి కడి గత కొన్ని రోజులుగా గ్రా మ సర్పంచ్ తుళ్లూరు నిర్మల కుమారి దం పతులు చెరువుకు నీటిని రప్పించేందుకు వివిధ శాఖల అధికారులతో కలిసి భగీరథ ప్రయ త్నం చేశారు.గ్రామస్తులు పలుమార్లు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి జ మలా పురం చెరువును సాగర జలాలతో నింపాలని వినతి పత్రాలు అందించారు భట్టి విక్రమార్క కృషితో అధికారులు జమలాపురం చెరువుకు నీటిని తీసుకురావడానికి శ్రమించారు ఎట్టకేలకు సోమవారం చెరువులోకి నీరు రాగానే సర్పంచ్ గ్రామస్తులతో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు జలహారతి ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి బొగ్గుల శ్రీనివాసరెడ్డి,బొగ్గుల గోవర్ధన రెడ్డి అనుమో లు కృష్ణారావు శీలం శ్రీనివాస రెడ్డి,గ్రామ సర్పంచ్ చట్టు పార్వతి గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.



# సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ - సత్తుపల్లి మండలం - వేంసూరు - పెనుబల్లి



## ఎమ్మెల్యేను సన్మానించిన సర్పంచ్, మాజీ సర్పంచ్..

తల్లాడ, అక్టోబర్ 19 (మనం న్యూస్): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తల్లాడ మండలంలోని పాత పినపాక గ్రామంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ను స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు, కోదండ రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ నర్వనేని లక్ష్మణరావు ఆమెను శాలువాలతో సన్మానించి సత్కరించారు. తొలుత ఎమ్మెల్యే బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మహిళలతో కలిసి కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ నర్వనేని స్వరూప రాణి, గుర్రం కవిత, వార్డు మెంబర్లు, స్థానిక నాయకులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ దేవి నవరాత్రుల మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

వేంసూరు అక్టోబర్ 19, (మనం న్యూస్): వేంసూ రు మండలం భరణి పాడు గ్రామంలో శ్రీ కృష్ణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దేవి నవరాత్రుల మహోత్సవ ంలో బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించిన ఈ వేడుకలో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖమ్మం సీపీని కలిసిన టీపీసీసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు..

తల్లాడ, అక్టోబర్ 19 (మనం న్యూస్): ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమి టీ రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్, జి ల్లావాసి నారపోగు వెంకటేశ్వర్లు శు భా కాంక్షలు తెలిపారు. సోమవారం ఖమ్మం సీపీ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగు చ్ఛం అందించి ప్రత్యేక దసరా శుభాకాంక్షలు తెలిపా రు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడు తూ జిల్లాలో శాంతిభద్రతల



పరిరక్షణలో సేవలందిస్తున్న సీపీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెల్లడించారు. అనంతరం ఇరువురు కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తీగల నాగరాజు ఉన్నారు.

# మారిన వాతావరణం.. ఎండ-చలి' గుప్పిట్లో ప్రజలు

**-పగలు భగభగలాడుతున్న ఎండ..**

**రాత్రి వణుకిస్తున్న చలి**

**-పంటల పరిస్థితిపై రైతుల దిగులు..**

**అధికారుల సాయం కోసం ఎదురుచూపులు**



వేంసూరు, అక్టోబర్ 19 (మనం న్యూస్): వేంసూరు మండలంలో వాతావరణం విచిత్రంగా మారుతోంది. ఒకే రోజులో భిన్నమైన వాతావరణ పరిస్థితులు చోటుచేసు కుంటుండటంతో ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో చలి పులి లంఖిస్తుంటే.. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత భానుడి భగభగలను గుర్తుచేస్తోంది.

**- ఎండిపోతున్న పొలాలు..**

**పెరిగే తెగుళ్ల ముప్పు....**

ఇప్పటికే వర్షాభావంతో సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న రైతులకు ఈ ఉష్ణోగ్రతల వ్యత్యాసం పెద్ద సవాలుగా మారింది. పగటిపూట ఎండ తీవ్రతకు పొలాల్లోని తేమ ఆవిరైపోతుండటంతో, పంట కాపా డుకోవడానికి బోరు బావులపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు రాత్రి పూట పెరుగుతున్న చలి వల్ల పంటలకు తెగుళ్ళు, పురుగులు ఆశించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతు న్నారు. పెరిగిన ఎరువులు, పురుగు మందుల ఖర్చుల నడుమ పంట నష్టం వాటిల్లితే ఆర్థికంగా కోలుకోలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**-పెరిగిన రోగాల భయం..**

ఈ విచిత్ర వాతావరణం వల్ల సామాన్య ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఉదయాన్నే పడుతున్న తీవ్రమైన చలికి వృద్ధులు, చిన్నపిల్లలు అలమటించిపోతుండగా, పగటిపూట ఎండలో పనిచేసే వ్యవసాయ కూలీలు అల్లాడిపోతున్నారు.

**-రైతాంగ విజ్ఞప్తి...**

క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి, తెగుళ్ళు పట్టకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు తగిన మార్గదర్శకాలు విడుదల చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

# వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..

**- అన్నదానాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి..**



తల్లాడ, అక్టోబర్ 19 (మనం న్యూస్):తల్లాడ పట్టణంలోని వైరా రోడ్డులోని నారాయణపురం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వద్ద సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దసరా పర్వదినం సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ముగింపు సందర్భంగా ప్రజలకు ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అమ్మవారి దయవల్ల ప్రజలందరూ ఆయురా రోగ్యాల తో, పాడిపంటలతో ఉండాలని ఆకాంక్షించారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ భక్త బృందం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే సండ్రకు సన్మానం..



తల్లాడ, అక్టోబర్ 19 (మనం న్యూస్): ఇటీవల ప్రతిష్ఠించిన తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామంలో ఉన్న శ్రీ శివగిరి అయ్యప్ప మణికంఠ క్షేత్రం ఆలయాన్ని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం అన్ని అన్ని విధాల అభివృద్ధి చెందాలని, పుణ్యక్షేత్రంగా ఏర్పడాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను స్థానిక నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, నాయకులు దుగ్గిదేవర వెంకట లాల్, ముప్పా మురళి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, కిన్నెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విజయానికి ప్రతీక విజయదశమి..

**- సీనియర్ నేత కొమ్మినేని వెంకటేశ్వర్లు..**



తల్లాడ, అక్టోబర్ 19 (మనం న్యూస్): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండు గ నిలుస్తుందని సీనియర్ రాజకీయ నాయకు లు, తల్లాడ మండలం అన్నారుగూడెం ఉప సర్పంచ్ కొమ్మి నేని వెంకటేశ్వర్లు (కేవీ) పేర్కొన్నారు. సోమవారం ఆ యన మాట్లాడుతూ మండ ల ప్రజలంద రికీ దసరా శుభాకాంక్షలు తెలి పారు. దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భ ంగా తొ మ్మిది రోజులు బ్రతుకమ్మ కార్యక్ర మాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## విజయదశమి శుభాకాంక్షలు

**- శ్రీదుర్గా అండ్ కో అధినేత కోనేరు అప్పారావు..**



తల్లాడ, అక్టోబర్ 19 (మనం న్యూస్): రాష్ట్ర ప్రజలందరికీ శ్రీదుర్గా అండ్ కో ఉడ్ చిప్స్ మ్యానుఫ్యాక్చర్ అధినేత కోనేరు అప్పారావు విజయదశమి శుభాకాంక్షలు తెలిపా రు. ఈ పర్వదినాన ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం అన్నారుగూడెం టీఎస్ఐఐసి ఇండస్ట్రియల్ పార్క్ వినియోగదారులకు, కస్టమర్లకు ఆయన ప్రత్యేక దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# టీజీపీఎస్సీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలి

**టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం**
**24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-2), 26న అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పరీక్షలు**
**పరీక్షా కేంద్రాల్లో సెల్ఫోన్లు, ఇంటర్నెట్కు అనుమతి లేదు**
**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన టీజీఎస్పిసి చైర్మన్**



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగ నియామకాల కోసం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అక్టోబర్ 24, 26 తేదీల్లో నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, అభ్యర్థుల తనిఖీలు, సాంకేతిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ఇతర మౌళిక వసతులపై టీజీపీఎస్సీ చైర్మన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, అదనపు డిసీపీ రామానుజన్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ సుమారు ఏడాదిన్నర విరామం అనంతరం ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలు మళ్లీ ప్రాధాన్యత సంతరించుకున్నాయని, ఇకపై వరుసగా పలు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత ఉందని, చిన్నపాటి పొరపాటు జరిగినా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిధిలో అక్టోబర్ 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-ఐఐ), అక్టోబర్ 26న అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికలను ఎంత బాధ్యతాయుతంగా నిర్వహిస్తామో, ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలను కూడా అంతే బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో జిల్లా కలెక్టర్లదే కీలక బాధ్యత అని, ప్రతి అధికారి తనకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి లోపం జరిగినా అది మొత్తం యంత్రాంగం వైఫల్యంగా పరిగణించబడుతుందని తెలిపారు.

**ప్రశ్నపత్రాల భద్రతకు పటిష్టమైన సాంకేతిక చర్యలు:**
ప్రశ్న పత్రాల లీకేజీకి ఎలాంటి అవకాశం లేకుండా టీజీపీఎస్సీ అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందని చైర్మన్ తెలిపారు. పరీక్షకు కొద్ది గంటల ముందు మాత్రమే ప్రశ్నపత్రాలను ఖరారు చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు పరీక్ష సమయం లోనే ప్రశ్నపత్రాన్ని మొదటిసారిగా చూసేలా అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కమిషన్కు చెందిన వ్యక్తులు సహా మరెవరూ అభ్యర్థి కంటే ముందుగా ప్రశ్నపత్రాన్ని చూసే అవకాశం లేకుండా సాంకేతిక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షల్లో అభ్యర్థులకు ప్రశ్నపత్రం మొత్తం ఒకేసారి కనిపించదని, కొన్ని ప్రశ్నలను మాత్రమే చూసే అవకాశం ఉంటుందని వివరించారు. పరీక్షలోని ప్రశ్నలు బయటకు వెళ్లకుండా సాంకేతిక భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు: పరీక్షా కేంద్రాల్లో పోలీసు బందోబస్తు, అభ్యర్థుల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని చైర్మన్ ఆదేశించారు. అభ్యర్థులతో పాటు పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహించే సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, తనిఖీ కోసం వచ్చే అధికారులు సైతం సెల్ఫోన్లు తీసుకు రాకూడదని స్పష్టం చేశారు.చీఫ్ సూపరింటెండెంట్కు మాత్రమే నిర్దేశిత నిబంధనల ప్రకారం సెల్ఫోన్ వినియోగానికి సంబంధించిన వెసులుబాటు ఉంటుందని, ఆ వినియోగం కూడా పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఇతరులతో ఏదైనా సమాచారం పంచుకోవాల్సి వస్తే చీఫ్ సూపరింటెండెంట్ ద్వారానే మాట్లాడాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఎవరు కూడా సెల్ఫోన్లు వినియోగించకుండా కఠినంగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ను నియమించాలని, ఇన్విజిలేటర్లకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఇన్విజిలేటర్లు సెల్ఫోన్లు తీసుకురావడం లేదా వినియోగించడం చేయకూడదని తెలిపారు.

**పరీక్షల నిర్వహణకు నిరంతర విద్యుత్ సరఫరా:**
పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం తలెత్తకుండా సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని చైర్మన్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, విద్యుత్ కోతలు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ముందుగానే గుర్తించి నియమించాలని, పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి:**
పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు కనీసం గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఉదయం 9-30, మధ్యాహ్నం 2-00 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనపై అభ్యర్థులకు ముందుగానే అవగాహన కల్పించేలా పత్రికలు, ఇతర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రస్తుతం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని, రానున్న నెలల్లో ముఖ గుర్తింపు విధానాన్ని కూడా వినియోగించనున్నట్లు తెలిపారు.

**అభ్యర్థుల తనిఖీలకు ప్రత్యేక ఏర్పాట్లు:**
పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల తనిఖీలకు అవసరమైన సిబ్బందిని నియమించాలని చైర్మన్ సూచించారు. మహిళా అభ్యర్థుల తనిఖీల కోసం మహిళా పోలీసులను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫ్రిస్కింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, అనుమతిలేని వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అవసరమైన రవాణా ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అస్వస్థతకు గురైన అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనే ప్రాథమిక చికిత్స పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్షా కేంద్రాన్ని విడిచి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. పరీక్ష సమయంలో ఏ అభ్యర్థి అయినా అస్వస్థతకు గురైతే పరీక్షా కేంద్రంలోనే ప్రాథమిక చికిత్స అందించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి మానవీయ మినహాయింపులకు అవకాశం ఇవ్వకూడదని, నిబంధనలను అందరికీ సమానంగా అమలు చేయాలని సూచించారు.

**పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదు:**
పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ధర్నాలు, ర్యాలీలు, రాజకీయ, ప్రాంతీయ లేదా ఇతర సభలకు అనుమతులు ఇవ్వకూడదని చైర్మన్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం నియామక పరీక్షల పారదర్శక నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిందని, అభ్యర్థుల్లో టీజీపీఎస్సీపై నమ్మకం పెరిగేలా పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తెలిపారు.

జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పరీక్షకు 7 కేంద్రాల్లో మొదటి రోజు 1,554 మంది అభ్యర్థులు, రెండో రోజు 1,335 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని గుర్తించి నియమించనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లను గుర్తించాలని, ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని నియమించాలని సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అభ్యర్థుల తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని, మహిళా అభ్యర్థుల తనిఖీలకు మహిళా పోలీసులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి వస్తువులు వెళ్లకుండా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సెల్ఫోన్ల వినియోగంపై కఠినమైన నియంత్రణ ఉండాలని ఆదేశించారు. సెల్ఫోన్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకుండా కఠినంగా అమలు చేయడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో పాల్గొనే ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని, విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలనే విషయాన్ని మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందుగానే గేట్లు మూసివేయనున్న విషయాన్ని ముందుగానే అభ్యర్థులకు తెలియజేయాలని తెలిపారు.ఇపరీక్షా కేంద్రాల్లో త్రాగునీటి సదుపాయం కల్పించాలని, అవసరమైన వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అక్టోబర్ 24, 26 తేదీల్లో నిర్వహించనున్న పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారుఈ వీడియో కాన్ఫరెన్సో సీపీఓ ఏ. శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ ఇ శ్రీనివాసా చారి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్):** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 39వడివిజన్ లోని శుక్రవారపేటలో శ్రీ నిమిషాంబికా దేవి ఆలయంలో మహిళలందరూ కలిసి నిమిషాంబికా దేవి కి 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి కనకాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి భజనలతో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చైర్మన్ నామేపల్లి మోహన్ రావు, డివిజన్ స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు..

## లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు..

**- విజిలెన్స్ సభ్యులు నరేష్ కుమార్..**

**తల్లాడ, అక్టోబర్ 19 (మనం న్యూస్):** తల్లాడ వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ ను వైరా వ్యవసాయ మార్కెట్ విజిలెన్స్ సభ్యులు నరేష్ కుమార్, వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, పత్తి, మిర్చి మద్దతు ధరలను అనుసరించి మార్కెట్ ఫీజు వసూలు చేయాలని సూచించారు. మిర్చి పంటకు కూడా ప్రస్తుతం మార్కెట్లో నమోదవుతున్న ధరల ప్రకారం ఫీజు వసూలు చేయాలన్నారు. ఎవరైనా లైసెన్స్ లేకుండా వ్యాపారం చేపడితే మార్కెట్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, పాషా ఉన్నారు.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
ONE FAMILY ONE VISION ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL



# కొత్తగూడెం

కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

## కొత్తగూడెంలో ఘనంగా షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

– పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు



**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 19 మనం న్యూస్ :** సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు చెక్కులను ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు పేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని తెలిపారు. ఆడపిల్లల వివాహాల సమయంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే నిరుపేద కుటుంబాలకు ఈ పథకాల ద్వారా భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడం వల్ల పేద కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గుతుందని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీ ముసుగులో కామరూపి..

- అందంగా లేవంటూ భార్యపై రాక్షస దాడి!
- బెల్టుతో ఒళ్లు హూనమయ్యేలా కొట్టి.. ఆసుపత్రి బెడ్‌పైనే చంపేస్తానంటూ బరితెగింపు!
- చాతకొండ 6వ బెటాలియన్ ఉద్యోగి బానోత్ లక్ష్మణ్ పైశాచికత్వం.. లక్ష్మీదేవిపల్లిలో వెలుగుచూసిన దారుణం
- వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భార్య పార్వతి.. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు ఆసుపత్రి బెడ్‌పైనే హతమారుస్తానని బహిరంగ బెదిరింపులు



**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 19 మనం న్యూస్ :** శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన ఓ ఖాకీ ఉద్యోగి ఇంట మాత్రం నిత్యం రాక్షస క్రీడ సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కట్టుకున్న భార్యను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన ఆ భర్తే పాలిట యముడిగా మారాడని బాధిత మహిళ వాపోతోంది. నువ్వు అందంగా లేవు అంటూ రోజూ మానసికంగా కుంగదీస్తూ బెల్టుతో ఒళ్లు హూనమయ్యేలా విచక్షణారహితంగా చితకబాదుతున్నాడని ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తూ చెబుతోంది. భర్త సాగిస్తున్న ఈ రాక్షస క్రీడను భరించలేక ఆ మహిళ చావే శరణ్యమంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే.. కనీసం ఆసుపత్రి బెడ్‌పై మృత్యువుతో పోరాడుతున్నా ఆ మృగాడికి కనికరం కలగలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఏకంగా ఆసుపత్రి బెడ్‌పైనే నలుగురి ముందూ చంపేస్తానంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగిన ఈ పైశాచిక ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో తీవ్ర కలకలం రేపుతోందని పోలీసులు పేర్కొంటున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న చాతకొండ 6వ బెటాలియన్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న బానోత్ లక్ష్మణ్‌కు, పార్వతితో ప్రేమ వివాహం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని వారు పేర్కొంటున్నారు. పదేళ్ల సంసార జీవితాన్ని సాఫీగా సాగించాల్సిన ఆ వ్యక్తి, కొంతకాలంగా అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్నాడని బాధిత మహిళ పేర్కొంటోంది. నువ్వు నా అంచనాలకు తగ్గట్టుగా అందంగా లేవు అంటూ భార్య పార్వతిని రోజూ హేళన చేయడం, ఇతర మహిళలను చూపిస్తూ తనను మానసికంగా తీవ్రంగా కుంగదీయడం నిత్యకృత్యం చేసుకున్నాడని ఆమె ఆవేదన చెందుతోంది. అంతటితో ఆగకుండా ప్రతి చిన్న విషయానికి ఇంట్లో రాద్ధాంతం చేస్తూ.. ఏకంగా బెల్టుతో శరీరంపై వాతలు తేలేలా విచక్షణారహితంగా కొడుతూ రాక్షసానందం పొందుతున్నాడని ఆమె కన్నీళ్లతో చెబుతోంది. ఇద్దరు పిల్లల తల్లని కూడా చూడకుండా తనపై సాగిస్తున్న ఈ దారుణ హింస పరాకాష్టకు చేరిందని బాధిత మహిళ పేర్కొంటోంది. భర్త సాగిస్తున్న ఈ భయంకరమైన వేధింపులు మితిమీరడంతో తాను గతంలోనే మహిళా సంఘాల సహాయంతో పోలీసులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశానని బాధిత మహిళ పార్వతి తెలిపింది. ఆ కక్షను మనసులో పెట్టుకున్న లక్ష్మణ్ మరింత రగిలిపోయాడని ఆమె పేర్కొంటోంది. గతంలో ఒకసారి తన చేతులు వెనక్కి విరిచి దారుణంగా గొంతు నులిమి చంపేసేందుకు కూడా ప్రయత్నించాడని బాధితురాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తెలిపింది. తనను హింసించడమే కాకుండా పిల్లలను శాశ్వతంగా దూరం చేసి ఇంట్లో నుంచి గెంటేసేందుకు పక్కా కుట్ర పన్నుతున్నాడని ఆమె వాపోతోంది. భర్త చేతిలో ప్రతిరోజూ చావడం కంటే ఒక్కసారే చచ్చిపోవడం మేలని భావించే తాను బలవన్మరణానికి పాల్పడినట్లు బాధిత మహిళ పేర్కొంటోంది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పార్వతిని కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం ఆమె అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రి బెడ్‌పై ప్రాణాపాయ స్థితిలో ఆ మహిళ నరకయాతన అనుభవిస్తోందని బంధువులు పేర్కొంటున్నారు. అయినా ఆ రాక్షస భర్త మనసు కరగలేదని అక్కడున్న వారు చెబుతున్నారు. నేరుగా ఆసుపత్రికి వచ్చి తోటి రోగులు, వైద్య సిబ్బంది, చుట్టుపక్కల జనం అందరూ చూస్తుండగానే తెగింపు ప్రదర్శించాడని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. నాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా నీ అంతు తేలుస్తా.. ఇక్కడే నిన్ను ప్రాణాలతో లేకుండా చేస్తా అంటూ బరితెగించి బహిరంగంగానే బెదిరింపులకు దిగాడని వారు పేర్కొంటున్నారు. నలుగురు చూస్తున్నారన్న కనీస భయం కూడా లేకుండా ఆసుపత్రి బెడ్‌పైనే భార్యను చంపుతానని బెదిరిస్తున్నాడంటే ఇంట్లో ఆ మహిళను ఏ స్థాయిలో నరకం చూపెట్టి ఉంటాడో అర్థం చేసుకోవచ్చని స్థానికులు మండిపడుతున్నారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బెటాలియన్ విభాగంలో పనిచేస్తూ సొంత భార్య పట్ల ఇంతటి పైశాచికత్వానికి పాల్పడుతున్న బానోత్ లక్ష్మణ్‌పై సర్వత్రా తీవ్రాగ్రహం వ్యక్తమవుతోందని ప్రజాసంఘాలు తెలిపాయి. ఖాకీ దుస్తుల ముసుగులో ఇంతటి అరాచకానికి పాల్పడుతున్న ఆ మృగాడిని సర్వీసు నుంచి తక్షణమే డిస్మిస్ చేయాలని, కఠిన చట్టాల కింద అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే బాధితురాలి కుటుంబానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఉక్కుపాదం మోపాలని వారు హెచ్చరిస్తున్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో

# భక్తిశ్రద్ధలతో అమ్మవారి సేవలు

– అమ్మవారికి నిత్య నివేదన, హారతి కార్యక్రమాలు





**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 19 మనం న్యూస్ :** వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయం మాజీ అధ్యక్షులు వందనపు సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి సేవా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆలయంలో అమ్మవారికి నిత్యం నివేదన సమర్పిస్తూ, హారతి కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషం. అమ్మవారి అనుగ్రహం పొందేందుకు భక్తులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

**అమ్మవారి సేవలో ప్రత్యేక హారతి**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఏక హారతి సమర్పించడం, నిత్య నివేదన చేయడం వంటి సేవా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థిస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని కోరుకుంటూ భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

**అమ్మవారి సేవలో శ్రీమతి స్వర్గలోక వందనపు విజయ**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సేవలో శ్రీమతి స్వర్గలోక వందనపు విజయ భర్త వందనపు సూర్య ప్రకాష్ రావు అమ్మవారికి ఈరోజు అక్టోబర్ 19 వితరణ సమర్పించినట్లు సమర్పించినట్లు పేర్కొన్నారు. భక్తితో అమ్మవారి సేవలో పాల్గొనడం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడం భక్తులలో భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తుంది.

**భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా ఆలయం**

కొత్తగూడెం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పూజలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొంటూ మనశ్శాంతిని పొందుతున్నారు. ఆలయంలో నిర్వహించే నిత్య సేవలు భక్తులలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు అమ్మవారిపై విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నాయి. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం



# కొత్తగూడెం నియోజకవర్గం

కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్

# పేదలకండగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు!

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా
- సీఎంఆర్ఎఫ్‌తో బాధితులకు ఆర్థిక చేయూత
- చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 19(మనం న్యూస్):** పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసా కల్పిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు కుటుంబాలకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అలాంటి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అదేవిధంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. ఆపదలో ఉన్న బాధితులకు సకాలంలో ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని, సీఎంఆర్ఎఫ్ సహాయం పొందే ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**76 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు :**
కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మొత్తం 76 మంది లబ్ధిదారులకు రూ.76,08,816 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వీరిలో కొత్తగూడెం ప్రాంతానికి చెందిన 34 మంది, లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన 33 మంది, సుజాతనగర్ మండలానికి చెందిన 9 మంది లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు.

**181 మందికి రూ.70.49 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం :**
ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గ పరిధిలోని 85 మంది బాధితులకు రూ.32,16,500 విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అలాగే ఇతర జిల్లాలకు చెందిన 96 మంది బాధితులకు తన సిఫారసుతో మంజూరైన రూ.38,33,750 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తంగా 181 మంది లబ్ధిదారులకు రూ.70,49,250 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, చైర్మన్ మండే హనుమంతరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు వాసిరెడ్డి మురళి బండి నరసింహ, బోయిన విజయ్ కుమార్, కంచర్ల హిమశ్రీ, దర్గయ్య, యూసుఫ్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు



**కొత్తగూడెం, టౌన్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్.కె. నగర్, బాబు క్యాంప్‌లో ఎం.ఎస్.కెయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా హెచ్ఎండీఏ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు జీవన్ బాబు--విజయబాయి దంపతులు, ఐఆర్ఎస్ అధికారి రవి కిరణ్--సాయి రోహిత దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందిన వారు ఉత్సవాల నిర్వహణను అభినందించారు. భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి దర్శనం కల్పిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్న ఎం.ఎస్.కె యూత్ సభ్యులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మిడిదొడ్డి సంపత్, రేగళ్ల రాజేష్, కదలి సాయి చంద్ర, ఎర్రబోయిన వంశీ, అజీమ్ ఖాన్, పల్లపు రాజేష్, చరణ్, లక్కీ పునీత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో బెల్ట్ షాపుల బరితెగింపు!

- ఎస్పీ కార్యాలయానికి సమీపంలోనే అక్రమ మద్యం విక్రయాలు?
- ప్రశ్నిస్తే బెదిరింపులు.. ఎక్సైజ్ అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?




**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ గాంధీనగర్ ప్రాంతంలో బెల్ట్ షాపుల వ్యవహారం స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఎస్పీ కార్యాలయానికి, 10వ డివిజన్ కార్పొరేటర్ నివాసానికి అతి సమీపంలోనే అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అధికారుల కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే ఈ పరిస్థితి నెలకొనడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అడ్డూ అదుపు లేకుండా బెల్ట్ షాపులు!**
స్థానికుల ఆరోపణల ప్రకారం.. రామారావు, రాజయ్య అనే వ్యక్తులు ఎలాంటి భయం లేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఈ విక్రయాల వల్ల పరిసర ప్రాంతాల్లో నివసించే మహిళలు, యువతతో పాటు సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఇళ్ల ముందు మద్యం సేవిస్తూ కొందరు గొడవలకు దిగుతున్నారని, దీంతో ప్రశాంతంగా జీవించలేని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రశ్నిస్తే ఎదురుదాడులు.. బెదిరింపులా?**
బెల్ట్ షాపుల వద్ద జరుగుతున్న పరిణామాలను ప్రశ్నించిన స్థానికులకు నిర్వాహకుల నుంచి దూషణలు, బెదిరింపులు ఎదురవుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని, తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధోరణిలో మాట్లాడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే, అక్రమ మద్యం విక్రయాల వెనుక ఎవరున్నారు? నిర్వాహకులకు అంతటి ధైర్యం ఎక్కడి నుంచి వస్తోంది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**ఎక్సైజ్ శాఖ స్పందించేదెప్పుడు?**
బెల్ట్ షాపుల వ్యవహారంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారుల స్పందన, ఆరోపణలపై అధికారిక నిర్ధారణ తెలియాల్సి ఉంది.

**జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారులకు స్థానికుల విజ్ఞప్తి**
గాంధీనగర్ ప్రాంతంలో బెల్ట్ షాపులపై వస్తున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టి, మహిళలు, యువత భద్రతకు భరోసా కల్పించాలని గాంధీనగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# హేమచంద్రపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా ఆయుధ, వాహన పూజలు

- దుర్గానవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్
- అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు.. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అన్నదానం





**కొత్తగూడెం క్రైమ్ , అక్టోబర్ 19 : ( మనం న్యూస్ ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో దుర్గానవరాత్రుల సందర్భంగా ఆయుధ పూజ, వాహన పూజ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖ విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలను సంప్రదాయబద్ధంగా అలంకరించి పూజలు చేశారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాల పాత్ర కీలకమని, వాటిని వినియోగించే విషయంలో సిబ్బంది పూర్తి బాధ్యత, అప్రమత్తత, క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అత్యవసర సమయాల్లో ప్రజలకు సత్వర సేవలు అందించడంలో పోలీస్ వాహనాలు కీలకమని పేర్కొన్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, సక్రమమైన స్థితిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకల సందర్భంగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు స్వయంగా పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బందికి అన్నప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## అమ్మవారి సమక్షంలో అన్నదానం ఎంతో పవిత్రం

### – మైసమ్మతల్లి దేవాలయంలో అన్నదానం ప్రారంభం



**పాల్వంచ, అక్టోబర్ 19(మనం న్యూస్):** అమ్మవారి సమక్షంలో అన్నదానం ఎంతో పవిత్రమైనదని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సోమవారం పాత పాల్వంచ గడియకట్ట, రజక బజార్ లోని శ్రీ మైసమ్మతల్లి దేవాలయంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం కార్యక్రమాన్ని కొత్వాల తో పాటు పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. నిత్యం అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, వై వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు వంగా రమేష్, మసనం శరత్, కోసూరి కిరణ్ కుమార్, రౌతు మల్లేష్, కరుకుల సతీష్, వెలువెంటి సుబ్రహ్మణ్యం, దండు మణి, దండు క్రాంతికుమార్, పాశం నాసరయ్య, బొందిల శేషగిరి, అగ్నిమండల భాస్కర్, బర్ల పాపారావు, మంగ్యా, తన్నీరు మణికంత, దేవుడు సాయి, సాయిబాబు పాల్గొన్నారు.

## పాత పాల్వంచలో ఘనంగా బతుకమ్మ సంబరాలు!

### – పూల పండుగలో మహిళల కోలాహలం..
### – ఆటపాటలతో మార్మోగిన వీధులు!

**పాల్వంచ, అక్టోబర్ 19(మనం న్యూస్) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు సోమవారం పాత పాల్వంచలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగ వాతావరణంతో పాత పాల్వంచలో సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద గీతాలు,




బతుకమ్మ పాటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను ఉపయోగించి బతుకమ్మలను అందంగా పేర్చడం ఈ పండుగ ప్రత్యేకత. పూలను పూజిస్తూ, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మహిళలు బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుంది. పాత పాల్వంచలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను చాటిచెప్పాయి. ఒకరినొకరు పలకరించుకుంటూ, బతుకమ్మ పాటలతో ఆనందంగా గడిపిన మహిళలు పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

## గురుకుల విద్యాలయాలతోనే విద్యాభివృద్ధి

### – ప్రిన్సిపల్ ఝాన్సీ రాణి
### – ఎస్ డబ్ల్యూ గురుకుల కళాశాలలో క్వెస్ట్





**పాల్వంచ, అక్టోబర్ 19(మనం న్యూస్):** గురుకుల విద్యాలయాల ద్వారానే విద్యాభివృద్ధి సాధ్యమని ప్రిన్సిపల్ ఝాన్సీ రాణి అన్నారు. పాల్వంచ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో కెస్ట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థినుల విద్యా నైపుణ్యాలను, వ్యక్తిగత సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో క్వెస్ట్ (కెస్ట్ ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఇళ్లకు అధ్యాపకులు వెళ్ళి వారి తల్లిదండ్రులతో తమ పిల్లల చదువును గూర్చి వివరించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అధ్యాపకులు ఏంత తోడుంటారో, తల్లితండ్రులు కూడా అంతే ప్రోత్సహం ఇవ్వాలని సూచించారు. అలాగే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివితే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో వివరించారు. అలాగే ప్రస్తుతం ఇంటర్ చదివే విద్యార్థులకు కూడా అడ్మిషన్స్ కోసం ఏలా అప్లై చేసుకోవాలో కూడా స్థానిక ప్రజలకు అధ్యాపకులు వివరించారు. విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బి ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. విద్యార్థినులు విద్యతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. క్వెస్ట్ కార్యక్రమంలో అధ్యాపకులు చురుకుగా పాల్గొని, తమ బాధ్యతను నిర్వర్తిచడం జరిగిందని పేర్కొన్నారు. అధ్యాపకులు పండగ సమయంలో కూడా విద్యార్థినులు ఇలా కలవడం సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థుల శ్రేయసు కోసం అరాట పడుతున్న అధ్యాపకుల బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ విద్యార్థినిల ఇంటికీ వెళ్లడం విశేషం.

## మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ వేడుక

### – డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల
### – ఆదివారం అర్ధరాత్రి వరకు జరిగిన బతుకమ్మ వేడుకలు



**పాల్వంచ, అక్టోబర్ 19(మనం న్యూస్):** తెలంగాణలోని మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ వేడుక అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా పాల్వంచ పట్టణ పరిధిలోని చింతల చెరువుకట్ట ఘాటు, బాపూజీ నగర్ ఘాట్, వెంకటేశ్వర హిల్స్ కాలనీ ఘాట్, రాతిచెరువు ఘాటులలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కొత్వాల, పాతపాల్వంచలోని తూర్పు బజార్, ముదిరాజ్ బజార్, రజక బజార్, మంగళ బజార్, గౌండ్ల బజార్, సాయినగర్



ప్రాంతాలలో, పాతపాల్వంచ 46 డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొని సాంప్రదాయ నృత్యాలు చేసి, నిర్వాహకులను ఉత్సాహపరిచారు. ఆదివారం అర్ధరాత్రి వరకు వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ప్రపంచంలోనే పువ్వులను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని అన్నారు. బతుకమ్మ అంటే ప్రకృతి అన్నారు. బతుకమ్మలు పేర్చి మహిళలు వాటి చుట్టూ తిరుగుతూ, ఆడి పాడటం సాంప్రదాయమని కొత్వాల అన్నారు..ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, దున్నపోతుల మణి, గౌరె అన్నపూర్ణ, దంతెబోయిన నరేష్, సింధు తపస్వి, నాయకులు కాపర్తి వెంకటాచారి, చింతా నాగరాజు, నరిగె సుజాత, మిర్యాల కమలాకర్, షేక్ చాంద్ పాషా, ఎస్.కె షఫీ, వజ్జల రాము, బూసి శ్రీను, కె.లక్ష్మణ్, సంపత్, యాటా నాని, దున్నపోతుల రవి తదితరులు పాల్గొన్నారు

## మైసమ్మ తల్లి ఆలయంలో అన్నప్రసాద వితరణ

### – పూజల్లో పాల్గొన్న 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు



**పాల్వంచ, అక్టోబర్ 19(మనం న్యూస్):** పాత పాల్వంచలోని మైసమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు (జీవీఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.




# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి ఎంఎల్ఏ జారె ఆదినారాయణ
- గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులతో సమావేశం



**దమ్మపేట,అక్టోబర్ 19(మనం న్యూస్):** గండుగులపల్లి,రాబోయే ఉమ్మడి ఖమ్మం--నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని, గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలిసి పార్టీ విధానాలు, ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని సూచించారు.

దమ్మపేట మండలం, గండుగులపల్లి,లోని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, నివాస క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసే విధానం, ఓటర్లకు ఎన్నికల ప్రాధాన్యతను వివరించాల్సిన అవసరంపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాధాన్యతతో కూడుకున్నవని, ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి, వారిని వ్యక్తిగతంగా కలిసి ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు నాయకులు కృషి చేయాలని తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటూ ఓటర్లతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్లకు చేరవేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.అన్ని విభాగాలు ఐక్యంగా పనిచేయాలి

ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు, కిసాన్ సెల్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు.పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి సమన్వయ లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రాడ్యుయేట్ ఓటర్లకు అందుబాటులో ఉంటూ వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని తెలిపారు.

**ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతంగా చర్చించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికల ప్రచారంలో వాస్తవ సమాచారానికే ప్రాధాన్యత ఇవ్వాలని, పార్టీ విధానాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు.సోషల్ మీడియా కోఆర్డినేటర్లు కూడా పార్టీ కార్యక్రమాలు, ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో చురుకుగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగిస్తూ ఎన్నికల ప్రచారాన్ని బలోపేతం చేయాలని తెలిపారు.

**సమష్టి కృషితో ముందుకు సాగాలి** : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణుల ఐక్యత, సమన్వయం కీలకమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త తన బాధ్యతను గుర్తించి పనిచేస్తే ఎన్నికల్లో పార్టీకి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## తుమ్మలకు దసరా శుభాకాంక్షలు తెలియజేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా



**దమ్మపేట, అక్టోబర్ 19(మనం న్యూస్):** సత్తుపల్లి రైతులకు సకాలంలో నీళ్లు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు సార్ ఎమ్మెల్యే. మా నియోజకవర్గంలో రైతులు మీ దయతో చాలా సంతోషంగా ఉన్నారు. సార్ ఎమ్మెల్యే. ఏలినో ఎంత ప్రభావం ఉన్న మీ దయతో మా చెరువులు నిండుగా ఉన్నాయి. ఎమ్మెల్యే తుమ్మలకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.అలానే జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైతులు తుమ్మల,ని కలిసి జిల్లాలో ఉన్న సమస్యలు సాగునీరు తాగునీటి కష్టాల గురించి వివరించి మీరు మాకు అందించిన సీతారామ వల్ల మా పంటలు పండుతున్నాయి. మీకు ఉన్న ముందు చూపు ఆలోచనతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు.మీలాంటి నాయకుడు మా ఖమ్మం జిల్లాలో ఉండటం మాకు చాలా గర్వంగా ఆనందంగా ఉంది. అని ఉమ్మడి జిల్లా రైతులు తుమ్మలకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అశ్వరావుపేట మండలం మారుమూల ప్రాంతమైన ముసర్లగూడెం మహిళలు తుమ్మలనీ కలిసి వారి సమస్యలు చెప్పుకున్నారు. త్వరలో మీ ఊరు వచ్చి మీకున్న సమస్యను సకాలంలో తీరుస్తాను. అని వారికి హామీ ఇచ్చారు.అలానే ఒక నిరుపేద వికలాంగుడు పెన్షన్ కోసం తుమ్మల,ని అడగగా ఇతను పూర్తిగా వికలాంగుడు ఇతనికి పెన్షన్ ఎందుకు రావడం లేదు అని సత్తుపల్లి ఎమ్మెల్యే,ని పిలిచి ఇతనికి త్వరగా పెన్షన్ ఇప్పించాలని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు కార్యకర్తలు దసరా శుభాకాంక్షలు తెలియజేయడానికి రావడంతో తుమ్మల నివాసం జనసంద్రంతో నిండిపోయింది.



## మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై సాయి కిషోర్ రెడ్డి



**దమ్మపేట, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి, గ్రామంలో సోమవారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ని అశ్వారావుపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అశ్వారావుపేట ఎస్సైగా బాధ్యతలు తీసుకొని మంత్రి తుమ్మలను సాయి కిషోర్ రెడ్డి, కలిసి పుష్ప గుచ్చం అందజేశారు.

## అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి

- రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి
- అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు



**దమ్మపేట,అక్టోబర్ 19(మనం న్యూస్):**

ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులందరూ సమన్వయంతో చేపట్టాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు,కోరారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమని.ప్రతి గ్రామంలో ప్రతి విద్యావంతుడి వద్దకు వెళ్లి అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలిని. ఇది సాధారణ ఎన్నిక కాదు. విద్యావంతులు, మేధావులు, ఉద్యోగార్థులు, యువత తమ తీర్పును చెప్పే ఎన్నికని.అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని. గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రభుత్వ వైఫల్యాలు,నిరుద్యోగ యువత సమస్యలు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న పట్టభద్రుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తే తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో కీలక మార్పుకు నాంది అవుతుందిని. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి ఈ ఎన్నిక బలమైన సంకేతంగా నిలుస్తుందిని. ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యావంతు లందరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలి. ఒక్క అర్హుడైన పట్టభద్రుడు కూడా ఓటరు నమోదుకు దూరం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దార మల్లికార్జునరావు,మాజీ ఉపసర్పంచ్ దారా యుగంధర్, వార్డు సభ్యులు రూపా రాంబాబు, దార రమేష్, (రాము), యార్లగడ్డ శ్రీనివాసరావు, ఇప్పా శేషాద్రి, జలగం మనోజు, తట్టుకోల వినోదు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## మార్క్సిస్టు పార్టీ పట్ల తుది శ్వాస వరకు అంకితభావంతో పనిచేసిన నాయకురాలు కొమరం స్వరాజ్యేశ్వరమ్మ: బి.వెంకట్

### – భద్రాచలంలో సీపీఎం బలోపేతమే ఆమెకు నిజమైన నివాళి



**భద్రాచలం, అక్టోబర్ 19 (మనం న్యూస్):** మార్క్సిస్టు పార్టీ, ప్రజా ఉద్యమాల పట్ల తుది శ్వాస వరకు అంకిత భావంతో పనిచేసిన ఆదర్శ నాయకురాలు కామ్రేడ్ కొమరం స్వరాజ్యేశ్వరమ్మ అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ కొనియాడారు.స్వరాజ్యేశ్వరమ్మ నివాసానికి చేరుకున్న ఆయన, ఆమె చిన్న కుమారుడు (ఉపాధ్యాయ సంఘం నాయకుడు) కొమరం శ్రీనివాస్, పెద్ద కుమార్తె అలివేణిలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బి. వెంకట్ మాట్లాడుతూ స్వరాజ్యేశ్వరమ్మ మహిళా ఉద్యమ నిర్మాణంతో పాటు గిరిజనుల హక్కులు, పోడు భూముల సమస్యలు, తునికాకు సేకరణదారుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు నడిపారని గుర్తుచేశారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఎర్రజెండాను వీడకుండా ముందుకు సాగాలని ఆమె జీవితం నేర్పిందన్నారు. కుటుంబ బంధాలు, వ్యక్తిగత సెంటిమెంట్లకు లొంగిపోకుండా ప్రజా ఉద్యమాలకే ప్రాధాన్యతనిచ్చిన నిబద్ధత గల నాయకురాలని ప్రశంసించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు మరింత పట్టుదలతో ప్రజల్లో ఉంటూ పనిచేయాలని ఆమె ఆచరించి చూపారని పేర్కొన్నారు.ఆమె స్ఫూర్తితో భద్రాచలం నియోజకవర్గంలో సీపీఎం బలోపేతానికి, ప్రజా ఉద్యమాల విస్తరణకు శ్రేణులు ఐక్యంగా కృషి చేయడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.స్వరాజ్యేశ్వరమ్మ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో బి. వెంకట్‌తో పాటు సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బండారు శరత్ బాబు తదితరులు ఉన్నారు.

## రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తి కె.మురళీమోహన్

### – ఘనంగా సన్మానించిన భద్రాచలం బార్ అసోసియేషన్

**భద్రాచలం, అక్టోబర్ 19 (మనం న్యూస్):** మహబూబాబాద్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ కె. మురళీమోహన్ కుటుంబ సమేతంగా భద్రాచలం పవిత్ర పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. తమ సహధర్మచారిణి, కుమారుడితో కలిసి విచ్చేసిన ఆయన శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రముఖ న్యాయవాదులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక కాకతీయ గ్రాండ్ సత్రంలో ఆత్మీయ సత్కార సమావేశాన్ని ఏర్పాటు చేశారు. న్యాయవ్యవస్థకు నిరంతర సేవలు అందిస్తున్న మురళీమోహన్ ని బార్ అసోసియేషన్ ప్రతినిధులు శాలువా, పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించి, శ్రీ సీతారామచంద్రస్వామి వారి జ్ఞాపికను (మెమొంటో) అందజేశారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి తదితరులు పాల్గొని న్యాయమూర్తి దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా 'సద్దుల బతుకమ్మ సంబరాలు

### – అలరించిన మహిళల ఆటపాటలు




**భద్రాచలం, అక్టోబర్ 19( మనం న్యూస్ ):**?తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే "సద్దుల బతుకమ్మ సంబరాలు" స్థానికంగా అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా జరిగాయి. నిర్వాహకులు బి.కె. కృష్ణవేణి, భావన, అన్నపూర్ణ, బి.కె. శ్రీనివాస్, బి.కె. హరిబాబు,వారి బృందం కార్యక్రమ ప్రాంగణాన్ని అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలంకరణతో పాటు, సద్దుల బతుకమ్మలను ఉంచేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికనే అమ్మవారి రూపంలో భారీ బతుకమ్మగా రూపొందించడం వేడుకకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ మంత్రముగ్ధులను చేసింది. అంతేకాకుండా, చిన్నారి అక్షర చైత్య దేవీ అలంకరణలో దర్శనమిచ్చి ఆహూతులందరినీ అలరిస్తూ ఆధ్యాత్మిక, ఆత్మిక ఆనందాన్ని నింపింది.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వారి సతీమణి ప్రవీణ, స్థానిక సీఐ సట్ల రాజు, తాళ్లూరి పంచాక్షరయ్య, గోళ్ల భూపతి రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో సంబరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా బి.కె. కృష్ణవేణి మాట్లాడుతూ.. "ఈ పూల పండుగ మనకిచ్చే గొప్ప సందేశం ఏంటంటే---వివిధ రకాల పూలన్నీ కలిసి అందమైన బతుకమ్మగా మారినట్లే, మనమంతా కలిసిమెలిసి ఉండాలని, ఒకరికొకరు సుఖశాంతులను పంచాలని" తెలిపారు. ప్రతి ఒక్కరూ దివ్య గుణాలనే సుగంధాన్ని వ్యాపింపజేస్తూ, తమ తమ ఇళ్లను స్వర్గసీమగా మార్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం అతిథులు మాట్లాడుతూ, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ ప్రాంగణాన్ని మార్మోగించారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన రాళ్ళబండి శ్రీదేవి, గోళ్ళ మంజుల, న్యాయవాది శారద ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలను ఎంపిక చేశారు. విజేతలు సిహెచ్. నర్మద, టి. ఈశ్వరి, కె. రజిత, జి. ప్రసన్న, రాధికలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలు అందజేసి నిర్వాహకులు అభినందించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుని, సద్దులను పంచుకోవడంతో సంబరాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహక బృందం సభ్యులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రాచలంలో కల్తీ నెయ్యి కలకలం..

### ఆహార భద్రతా శాఖ, పోలీసుల సంయుక్త తనిఖీలు



**భద్రాచలం, అక్టోబర్ 19 (మనం న్యూస్):** పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో సోమవారం జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారులు, భద్రాచలం టౌన్ పోలీసులు సంయుక్తంగా మెరుపు తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో నెయ్యి తయారీకి ఉపయోగిస్తున్న 30 కిలోల డాల్డా, 10 లీటర్ల నెయ్యి, 15 లీటర్ల పామాయిల్, 3 కిలోల వెన్నను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి ప్రాంతానికి చెందిన యువరాజ్ అనే వ్యక్తి సుమారు రెండు నెలల క్రితం భద్రాచలానికి వచ్చి, అశోక్‌నగర్ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా నెయ్యి తయారీ కేంద్రం నడుపుతున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.ఘటనా స్థలంలో లభించిన ఆహార పదార్థాల నమూనాలను సేకరించి నాణ్యతా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత కల్తీ ఏ మేరకు జరిగిందనే అంశంపై స్పష్టత రానుందని అధికారులు తెలిపారు. గతంలోనూ ఇదే కుటుంబానికి చెందిన మరో వ్యక్తి కల్తీ నెయ్యి తయారీ వ్యవహారంలో పట్టుబడినట్లు విచారణలో వెల్లడైంది.నిర్వాహకుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆహార భద్రతా శాఖ అధికారులు భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ ఆహార కల్తీకి పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఆహార తయారీదారులు, వ్యాపారులు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని అధికారులు హెచ్చరించారు. పట్టణంలో కల్తీ పదార్థాల తయారీ, విక్రయాలపై నిఘా మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు.

## టేకులపల్లి పోలీసుల చొరవ.. పోగొట్టుకున్న మొబైల్ బాధితునికి అందజేత

### – సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె తిరుపతి



**టేకులపల్లి,అక్టోబర్ 19(మనం న్యూస్):** సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ టేకులపల్లి పోలీసులు మరో బాధితునికి అండగా నిలిచారు.15 నెలల క్రితం పోయిన మొబైల్ ఫోన్‌ను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి,సోమవారం బాధితునికి అందజేశారు.వివరాల్లోకి వెళితే టేకులపల్లి మండలం,9వ మైలు తండా గ్రామానికి చెందిన ధరావత్ అంజి అనే వ్యక్తి దాదాపు 15 నెలల క్రితం టేకులపల్లిలో తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు.దీనిపై ఆయన టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుని ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న టేకులపల్లి ఎస్సై తిరుపతి సిబ్బంది,కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోర్టల్ సహాయంతో ఆ మొబైల్ జాడను పట్టుకున్నారు.సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి ఫోన్‌ను రికవరీ చేసి,ఈరోజు టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ధరావత్ అంజికి స్వయంగా అందజేశారు.తమ విలువైన ఫోన్ సురక్షితంగా చేతికి అందడంతో బాధితుడు ధరావత్ అంజి టేకులపల్లి పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిషాసుర మర్దిని రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు





**చర్ల, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** మండలంలోని శ్రీ కనకదుర్గమ్మ, బండాలమ్మ, త్రికూట, ఉమారామలింగేశ్వర ఆలయాలతో పాటు పాతచర్ల, అంబేద్కర్ సెంటర్, గొల్లకట్టవీది, లారీ ఆఫీస్, సాలెబజార్, మొగళ్లపల్లి రామాలయం, తేగడ, కుదునూరు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తొమ్మిదవ రోజు అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారం లో భక్తులకు దర్శన మిచ్చారు .దుర్గాదేవి అవతారాల్లో అత్యంత శక్తివంతమైన రూపం మహిషాసుర మర్దిని. మహిషాసురుడు అనే రాక్షసుడిని సంహరించి లోకాన్ని కాపాడిన శక్తి స్వరూపిణిగా అమ్మవారిని ఈరోజు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పూజారులు అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం నుండే మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. “యాదేవి సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా” అంటూ భక్తులు చేసిన భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే ఈ మహిషాసుర మర్దిని రూపం అని, అమ్మవారి ఆశీస్సులతో







అందరూ సుఖసంతోషాలతో ఉంటారని వెల్లడించారు.

**ఆలయం వద్ద అన్నదానం...**

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ మండపం వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

# ఆటో బోల్తా..

## – ఎనిమిది మందికి గాయాలు ..
## – వైద్యశాలకు తరలింపు









**చర్ల, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** మండలంలోని పూసుగుప్ప గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఛత్తీస్‌ఘడ్ కు చెందిన 8 మందికి గాయాలయ్యాయి. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ రాంపురం గ్రామానికి చెందిన పదకొండు మంది గ్రామంలో బతుకమ్మ సంబురాలను ముగించుకొని తెలంగాణ లోని సరిహద్దు గ్రామమైన పూసుగుప్ప సమీపంలోని వాగులో నిమజ్జనం చేసారు. తిరుగుప్రయాణంలో ఆటో గుంతలో పడి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మడకం లక్ష్మి, మడివి సోసి, మడకం లక్కి, నూప మంజుల, వట్టి దేవి, కుంజా ఉంగి, లక్ష్మి, నాందే గాయపడ్డారు. ఆటో బోల్తా పడిన వెంటనే డ్రైవర్ పరారవడంతో మరొక ఆటో డ్రైవర్ క్షతగాత్రులను చర్ల సామాజిక అరోగ్య కేంద్రంకు తరలించాడు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సాయివర్ధన్ క్షతగాత్రులకు చికిత్సలు అందచేసారు.

# బతుకమ్మ భక్తులకు మజ్జిక, తాగునీరు పంపిణీ




**చర్ల, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** బతుకమ్మ నిమజ్జనాల సందర్భంగా తేగడ గ్రామంలోని తాలిపేరు నది వద్దకు విచ్చేసిన భక్తులకు తేగడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మజ్జిక, పానకం, చల్లని తాగునీటిని పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ జమ్ముల మురళీకృష్ణ, ఉప సర్పంచ్ పాగా రాంప్రసాద్ ఆధ్వర్యంలో, పాకలపాటి సత్యనారాయణ రాజు, కుప్పాల సౌజన్య సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనానికి వచ్చిన మహిళలు, భక్తులు, చిన్నారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మజ్జిక, పానకం, చల్లని తాగునీటిని అందించారు. ఈ సేవా కార్యక్రమంలో నిరంజన్, ఎల్ ఎం ఎల్ రెడ్డి, చినిగిరి నరేష్, సత్తిబాబు, రవి, శ్రీను, నాగరాజు, వీరన్న, నరసింహా, రామ్, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, పంచాయతీ సిబ్బంది, యువకులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

మనం



# చర్ల

## చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

# సిపిఐ ఆర్గనైజింగ్ కార్యదర్శి పదవికి రాజీనామా



**చర్ల, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** పార్టీ నాయకులు అవలంబిస్తున్న ఒంటెద్దు పోకడల కారణంగా మండల సిఐపి ఆర్గనైజింగ్ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు సిపిఐ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ జాకీర్ హుస్సేన్ వెల్లడించారు. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషాకు సమాచారం అందించినట్లు తెలిపారు. 2025 సంవత్సరంలో పార్టీ తనకు ఈ పదవి అప్పగించిందని తెలిపారు. పదవి చేపట్టిన దగ్గర నుండి పార్టీకి కట్టుబడి పనిచేసానని, గత గ్రామ పంచాయతీ ఎన్నికలలో తిప్పాపురం పంచాయతీ గెలుపు బాద్యత అప్పగించగా సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించుకున్నామని వివరించారు. అనంతరం స్దానిక నాయకుల ఒంటెద్దు పోకడలతో పార్టీ మనుగడ దెబ్బతింటోదని దీంతో విసుగుచెంది ఆర్గనైజింగ్ కార్యదర్శి పదవికి రాజీనామా చేసి సాదారణ సభ్యునిగా కొనసాగాలని నిర్ణయించుకున్నట్లువివరించారు.

# ముగిసిన బతుకమ్మ సంబరాల తాలిపేరు నదిలో నిమజ్జనం





**చర్ల, అక్టోబర్ 19 (మనం న్యూస్):** చర్ల మండలంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆడపడుచులు జరుపుకున్న బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులను ధరించి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... అంటూ ఆడిపాడిన పాటలతో చర్ల వీధులు కళకళలాడాయి. అనంతరం మహిళలంతా కలిసి స్థానిక మేళతాళాలతో తాలిపేరు నది వద్దకు చేరుకుని, సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను నదిలో నిమజ్జనం చేశారు. సోమవారం రాత్రి ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమం మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. నిమజ్జనం సందర్భంగా తాలిపేరు నదీ తీరం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ రాజువర్మ, ఎస్ఐ లు నర్సిరెడ్డి, కేశవ్ ల పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తేగడ పంచాయతీ సర్పంచ్ జమ్ముల మురళీకృష్ణ ఆద్వర్యంలో ఏర్పాట్లు చేసారు. ఆడబిడ్డలంతా సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో బతుకాలని కోరుతూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని సర్పంచ్ అన్నారు.



మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి

## జేకే 5 ఓసీ శ్రీ దుర్గా భవాని మాత ఆలయంలో ఘనంగా మహా చండీ యాగం





**ఇల్లందు, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** ఇల్లందుఏరియాలోని జేకే 5 ఓసీ శ్రీ దుర్గా భవాని, మాత ఆలయంలో సోమవారం దుర్గాదేవి, నవరాత్రుల సంద ర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యం లో మహా చండీ యాగం, ప్రత్యేక పూజలు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లందు ఏరియా జీఎం, వి. కృష్ణయ్య, దంపతులు మహా చండీ యాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ దుర్గా భవాని మాతకు ప్రత్యేక పూజలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులుపొందారు. తదనంతరం నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ (సహపంక్తి భోజనాలు) కార్యక్రమంలో ఏరియా అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జాకీర్ హుస్సేన్, కేఓసీ పీవో మాధవరావు, డీజీఎం ఐడీ ప్రభాకర్ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామదాసు, తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జేకే కాలనీలో చెస్, క్యారమ్స్, రీజినల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**ఇల్లందు, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని జేకే, కాలనీ సీఈ యాప్‌లో సోమవారం డబ్ల్యూ పిడ ఎస్ సి ఏ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీజినల్ స్థాయి చెస్, క్యారమ్స్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో ఇల్లందు, మణుగూరు, ఏరియాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, క్రీడల్లో గెలుపొందిన వారిని అభినందిస్తూ, ఓటమి పాలైన వారు నిరుత్సాహపడకుండా మరింతపట ్టదలతోప్రయత్నించాలని సూచించారు. చెస్, క్యారమ్స్ వంటి క్రీడలు ఏకాగ్రత, ఆలోచనా శక్తి, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ముఖ్యంగా చెస్ మేధోపరమైన సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఇటువంటి క్రీడలు ఉద్యోగుల్లో మానసిక చురుకుదనాన్ని పెంచి, విధి నిర్వహణలో కూడా మెరుగైన పనితీరుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఉద్యోగుల్లోక్రీడాస్ఫూర్తి, పరస్పర,స్నేహభావంపెంపొ ందించేం దుకు ఇలాంటి క్రీడా పోటీలుఎంతోఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ పిఎస్ఏ జి ఏ కోఆర్డినేటర్ కిషోర్, జనరల్ కెప్టెన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందులపాడులో ఘనంగా బతుకమ్మ పోటీలు

### -విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు!









**ఇల్లందు, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** ఇల్లందుమున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు ఇల్లందులపాడు కాళీమాత తల్లి ఆలయ ప్రాంగణంలో అక్టోబర్ 18వ తేదీన స్థానిక యూత్ కమిటీ, పెద్దల ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య, సహకారంతో, ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, దంపతుల నాయకత్వంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ బతుకమ్మ పోటీల నిర్వహణలో చింతలచెరువు సుమంత్, బొబ్బిలి, ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఎంతో కృషి చేసిన స్థానిక యూత్ కమిటీ సభ్యులు, పెద్దల సహకారంతో, మహిళలకు పండుగ వాతావరణంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలను ఎంపిక చేసేందుకు ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ యదలపల్లి అనసూయ, మాజీ సర్పంచ్ పద్మ, 18వ వార్డు కౌన్సిలర్ పాబోలు స్వాతి, పాల్గొన్నారు. విజేతలకు అందజేసే బహుమతులను స్థానిక నాయకులు, మిత్రులు అందే భరత్, స్వయంగా కొనుగోలు చేసి స్పాన్సర్ చేయడం విశేషం. ఆయన సమక్షంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, దంపతుల ఆధ్వర్యంలో, విజేతలకు బహుమతులు అందజేశారు.

**బహుమతుల విజేతలు మొదటి బహుమతి: బోశాల ఉపేంద్ర -- డ్రెస్సింగ్ టేబుల్**

రెండవ బహుమతి: నేలమర్రి స్వరూప -- మిక్సీ. మూడవ బహుమతి: సరికొండ సంధ్య -- పట్టు చీర. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ,పండుగ నుమహిళలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవడం పట్ల స్థానిక మహిళలు, యువత, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, కి, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, దంపతులకు, బహుమతుల అందించినదాత అందే భరత్, కి, నిర్వహణలో విశేష కృషి చేసిన చింతలచెరువు సింహాద్రి కి, యూత్ కమిటీ సభ్యులకు, పెద్దలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గాలిపల్లీ స్వరూప, వార్డు అధ్యక్షులు ఎండి యాకూబ్, వార్డు ప్రధాన కార్యదర్శి నేలమర్రి నాగరాజు, 2 వార్డు గౌరవాధ్యక్షులు దళితరత్న మేకల శ్యామ్ మాదిగ, చింతలచెరువు రఘు, చింతలచెరువు నరేష్, శ్రీను, జగన్, ధర్మల రాజేందర్, ధనుష్,సిహెచ్,వేణు,తదితరులు పాల్గొన్నారు,

## ఘనంగా ఫ్యామిలీ డే, సద్దుల బతుకమ్మ సంబరాలు

### - సాంప్రదాయబద్ధంగా గౌరీ పూజతో ప్రారంభమైన వేడుకలు

### ఆటపాటలతో సందడిగా సాగిన సంబరాలు



**ఇల్లందు, అక్టోబర్ 19 (మన న్యూస్) :** ఇల్లందు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్యామిలీ ,డే, తెలంగాణ సాంస్కృతిక పండుగైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని ఆదివారం కాలనీలోని బ్లాక్ డైమండ్ స్టేడియంలో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య, ముఖ్య అతిథిగా, సేవా అధ్యక్షురాలు వి. రమ, అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు గౌరీ, పూజ, నిర్వహించిన అనంతరం సాంప్రదాయబద్ధంగా సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళలు రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను మైదానానికి తీసుకువచ్చి, వాటి చుట్టూ వలయాకారంలో తిరుగుతూ చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడారు. మహిళల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో స్టేడియం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన పండుగ అని, ఇది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉందన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. బొడ్డెమ్మతో ప్రారంభమై ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు కొనసాగే ఈ పండుగలో ప్రతి రోజుకూ ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. బతుకమ్మ పాటల్లో మహిళల జీవన అనుభవాలు, కుటుంబ అనుబంధాలు,ప్రేమాభిమానాలు,స్నేహం,భక్తి,ప్రకృతిపైప్రేమప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ వేడుకల్లో భాగంగా సింగరేణి కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో తమ సద్దుల బతుకమ్మలను తీసుకువచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. అందంగా అలంకరించిన బతుకమ్మలను పరిశీలించి, ఎంపికైన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులను నగదు రూపంలో అందజేశారు. అనంతరం మహిళల ఆధ్వర్యంలో సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటపాటల కార్యక్రమాలు నిర్వహించడంతో వేడుకలు మరింత సందడిగా సాగాయి. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు స్టేడియం ప్రాంగణంలో ప్రత్యేకంగా తాత్కాలిక నీటి కొలనును ఏర్పాటు చేయడంతో పాటు, మహిళలు ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగను జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలోసాంప్రదాయ వైభవం, తెలంగాణ సంస్కృతీ సంపద ఉట్టిపడేలా ఈ ఫ్యామిలీ డే మరియు సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా ముగిశాయి.

# దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చేపట్టాలి

**– వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**





**అశ్వాపురం, అక్టోబర్ 19 ( మనం న్యూస్ ):** మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామపంచాయతీ కుమ్మరిగూడెం వద్ద గోదావరి నదిపై కాటన్ దొర నిర్మించిన దుమ్ముగూడెం ఆనకట్ట ను సోమవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆనకట్ట వద్ద నీటి నిల్వను పెంచేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలను అధికారులతో సమీక్షించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, దుమ్ముగూడెం ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. గోదావరి నదిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు జిల్లాలకు తాగునీరు అందించాల్సి ఉన్నందున, రానున్న నెలల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులకు కారణమవుతున్న సూపర్ ఎల్‌నినో భూతం ప్రభావం రానున్న కాలంలో తీవ్రంగా ఉండే అవకాశం ఉందని మంత్రి తెలిపారు . పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, దక్షిణ భారతదేశంలో వర్షపాతంపై కూడా ప్రభావం పడుతుంది అని తెలిపారు. ఇప్పటికే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఆందోళన నెలకొందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ జలవనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. రానున్న వేసవిలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, దీంతో విద్యుత్ వినియోగం, డిమాండ్ కూడా పెరిగి విద్యుత్ కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తవచ్చని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని అన్నారు . రానున్న వేసవిలో విద్యుత్ కొరత తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని నీరు, విద్యుత్ వనరుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద సుమారు ఒక మీటరు ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని, విజయదశమి పండుగ రోజైనా పనులకు ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఇసుక బస్తాల ఏర్పాటు ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేసుకునేలా ఇంజినీరింగ్ అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నీటి ప్రవాహం తగ్గకముందే పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా ఒక టీఎంసీ కంటే ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటే, రానున్న నెలల్లో మరింత కాలం తాగునీటి అవసరాలను తీర్చవచ్చని తెలిపారు.ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు చర్యలతో పాటు నీటి వినియోగాన్ని కూడా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులకు సూచించారు. సమీపంలోని ప్రైవేటు జలవిద్యుత్ కేంద్రానికి నీటి వినియోగం విషయంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆనకట్టలో తగినంత నీటి నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు నిల్వ ఉన్నప్పుడు, అదనంగా ప్రవహించే మిగులు నీటిని మాత్రమే ఇతర అవసరాలకు వినియోగించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఇతర అవసరాలకు నీటి వినియోగాన్ని నియంత్రించాలని స్పష్టం చేశారు.సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి మాట్లాడుతూ, వివిధ అనుమతులు, న్యాయపరమైన అడ్డంకుల కారణంగా గత ఐదేళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని అన్నారు . ఇటీవల సుప్రీంకోర్టు ద్వారా సంబంధిత న్యాయపరమైన అంశాల్లో పురోగతి సాధించామని, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఈ నెలలో లభించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు.సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన యంత్రాలు, సామగ్రి, సిబ్బంది, ఇతర వనరుల సమీకరణపై ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత నిర్మాణ సంస్థకు సూచించారు. నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులు ప్రారంభించేలా జిల్లా యంత్రాంగం, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రాజెక్టు పనుల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవడం ద్వారా అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు వీలవుతుందని అన్నారు .రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పంటల సాగుకు ఎకరానికి లక్ష నుంచి రెండు, మూడు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవసరమవుతున్న నేపథ్యంలో, పంట చేతికొచ్చే సమయంలో నీరు, విద్యుత్, భూగర్భ జలాల కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల సాగుకు ముందే నీటి లభ్యత, విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.తక్కువ వ్యవధిలో దిగుబడి, ఆదాయం వచ్చే కూరగాయలు, పప్పుదినుసులు వంటి పంటలను అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా సాగు చేయాలని మంత్రి సూచించారు. ఒకటి లేదా రెండు తడులతో పంట చేతికి వచ్చే అవకాశాలను పరిశీలించాలని, అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా అధిక పెట్టుబడులతో పంటలు సాగుచేసి నష్టపోవడం కంటే, అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం మంచిదని అన్నారు . వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు అందించాలని ఆదేశించారు .ప్రజలు కూడా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు,సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మనం



## మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం - బూర్గంపాడు

## మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని, సీఐ నాగబాబు తనిఖీలు

**– నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**





**మణుగూరు, అక్టోబర్ 19(మనం న్యూస్):** పట్టణం లోని మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీఐ నాగబాబు పాల్గొన్నారు. మెడికల్ షాపుల్లో మందుల విక్రయాలు, నిల్వలు, సంబంధిత రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మెడికల్ షాపుల లైసెన్సులు, మందుల నిల్వలు, గడువు ముగిసిన ఔషధాలు, మందుల కొనుగోలు బిల్లులు, విక్రయ రికార్డులను తనిఖీ చేశారు. అలాగే వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో విక్రయించాల్సిన మందులను నిబంధనల ప్రకారం విక్రయిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. ఫార్మసిస్ట్ అందుబాటులో ఉండటం, మందులను సరైన పద్ధతిలో నిల్వ చేయడం వంటి అంశాలపై ఆరా తీశారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. గడువు ముగిసిన మందులను విక్రయించరాదని, మందుల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు జరిపినా, నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందేలా, మందుల విక్రయాల్లో అక్రమాలకు తావులేకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

## సింగరేణి మణుగూరు ఏరియాలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**– తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ**

**– మణుగూరు జీఎం దుర్గం రామచందర్**



**మణుగూరు, అక్టోబర్ 19(మనం న్యూస్):** సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి వేడుకలతో సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ఉద్యోగుల కుటుంబాల మధ్య ఆత్మీయత పెరుగుతుందని పేర్కొన్నారు.ఏరియా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నారు.ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీంద్ర రెడ్డి, పాల్వంచ డీఎస్పీ సతీష్, సీఐ పి. నాగబాబు, డి. వెంకట రామారావు, జె. వేణుమాధవ్, ఎస్. రమేష్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వై. రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ బ్యాంక్ కార్యదర్శి వి. కృష్ణంరాజు, సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి వి. మదన్ నాయక్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారి ఈ. శ్రీనివాస్, సింగరేణి అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మనం



# పినపాక

మణుగూరు - అశ్వాపురం - పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

## గోదావరి జలాల కోసం పోరాడుదాం

**- బతుకమ్మ ఉత్సవాలలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**

**- కోలాటాలతో ఆకట్టుకున్న మహిళలు**



**మణుగూరు, అక్టోబర్ 19(మనం న్యూస్):** గోదావరి జలాలు సాధించే వరకు పోరాడుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.కుమ్మరిగూడెం గ్రామంలో బతుకమ్మ ఉత్సవాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలాపునే గోదావరి నది ప్రవహిస్తున్నా అమ్మగారిపల్లి,పాములపల్లి పంచాయతీల పరిధిలో సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గోదావరి జలాల సాధన కోసం ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు.సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కు నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు,అశ్వాపురం మండలంలో ఉన్న అన్ని చెరువులకు సీతారామ ప్రాజెక్టు కాలువలు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు.మారెల్లపాడు లిఫ్ట్ ద్వారా తుమ్మల చెరువును పూర్తి స్థాయిలో నింపాలని,యాసంగి పంటకు అనుమతించాలని కోరారు, ప్రాజెక్టు లేకుండా రైతులకు సాగునీరు ఇస్తామని ఇంకెన్నాళ్ళు మోసం చేస్తారని విమర్శించారు, అదేవిదంగా బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం ప్రజలను ఆకట్టుకుందన్నారు.కళాకారులను వారు అభినందించారు.ఆడపిల్లను పుట్టనిద్దాం,బ్రతకనిద్దాం,ఎదగనిద్దామని తెలిపారు, సమాజంలో నేడు మహిళలపై అత్యాచారాల,హత్యలు నిత్యకృత్యం అయ్యాయన్నారు.మహిళల హక్కుల కోసం మహంకాళిలా ఉద్యమించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పాయం నరసింహారావు, మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, మండల కమిటీ సభ్యులు మోకాళ్ళ రమేష్, పాయం విజయ, శాఖ కార్యదర్శి పాయం దుర్గా ప్రసాద్, పాయం వెంకమ్మ, మోకాళ్ళ దేవ కుమారి,కణితి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## బూర్గంపాడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కాక రాములు నియామకం



**అశ్వాపురం,అక్టోబర్ 19(మనం న్యూస్ ):** బూర్గంపాడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా మండలంలోని గొందిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాక రాములు నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా కాక రాములు సేవలను గుర్తించి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎంపిక చేసేన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, వ్యవసాయ, మార్కెట్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి,ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్

## ఇరవెండిలో అన్నదాన సేవకు శ్రీకారం

**- అమ్మవారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ ప్రారంభించిన తాళ్లూరి పంచాక్షరయ్య**

**బూర్గంపహాడ్ అక్టోబర్ 19 (మనం న్యూస్ ) :** భక్తి భావం వెల్లివిరుస్తున్న ఇరవెండి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ప్రారంభించారు.కార్యక్రమంలో భాగంగా తొలుత అమ్మవారిని దర్శించుకున్న పంచాక్షరయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. తదుపరి అన్నప్రసాద వితరణను ప్రారంభించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.శరన్నవరాత్రి ఉత్సవాల వేళ అమ్మవారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం భక్తుల్లో ఆనందాన్ని నింపింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నప్రసాదం



అందించడం ఉత్సవాల్లో ప్రత్యేకతగా నిలిచింది.ఈ కార్యక్రమంలో తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సారపాకలో రహదారికి మోక్షమెప్పుడు?

**- రామభద్ర ఐటీఐ నుంచి గాంధీనగర్ కాలనీకి వెళ్లే మార్గం అధ్వానం..**

**- మరమ్మతులు చేపట్టాలని చుక్కపల్లి బాలాజీ విజ్ఞప్తి**

**బూర్గంపహాడ్ అక్టోబర్ 19 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని రామభద్ర ఐటీఐ కళాశాల నుంచి గాంధీనగర్ కాలనీకి వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని భారతీయ జనతా పార్టీ నాయకుడు చుక్కపల్లి బాలాజీ సంబంధిత అధికారులను కోరారు. రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు, విద్యార్థులు రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ రహదారి సమస్యను గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని తెలిపారు. గ్రామపంచాయతీలోనూ రహదారి నిర్మాణానికి సంబంధించి తీర్మానం చేయడంతో పాటు, పనులు చేపడతామని అధికారులు హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు.వర్షాకాలంలో రహదారిపై గుంతలు ఏర్పడి రాకపోకలకు మరింత ఇబ్బందికరంగా మారుతోందని తెలిపారు. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారితో పాటు విద్యార్థులు సైతం ఈ మార్గంలో ప్రయాణించేందుకు



ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని బాలాజీ కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు శాశ్వత రహదారి నిర్మాణ పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మణుగూరులో తొలిసారిగా నవదుర్గ అఖండ జ్యోతి పూజ

**- ఐలమ్మ నగర్ శ్రీ కనకదుర్గా సహిత పెద్దమ్మ తల్లి జీవాలయంలో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు**

**మణుగూరు, అక్టోబర్ 19(మనం న్యూస్):** మణుగూరు పట్టణంలోని ఐలమ్మ నగర్‌లో స్వయంభువుగా కొలువైన శ్రీశ్రీ కనకదుర్గా సహిత పెద్దమ్మ తల్లి జీవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అష్టమి సందర్భంగా నవదుర్గల పూజ, అఖండ జ్యోతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాపర్తి శ్రీహరినాథ్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఒకే పీఠంపై ఇద్దరు మహాశక్తులు కొలువైన విశిష్ట క్షేత్రంగా పేరొందిన ఈ ఆలయంలో మణుగూరు చరిత్రలో తొలిసారిగా అమ్మవారిని నవదుర్గల రూపాల్లో అలంకరించి, అరటి చెట్లతో ప్రత్యేక మండపాన్ని నిర్మించి అఖండ జ్యోతిని వెలిగించడం విశేషంగా నిలిచింది.ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, చండీ పారాయణం, నవదుర్గా స్తోత్ర పఠనం నిర్వహించారు. సాయంత్రం భక్తుల సమక్షంలో అఖండ జ్యోతిని వెలిగించి ప్రత్యేక హారతులు సమర్పించారు. శేషగిరిశర్మ (గిరి) పురోహితుడిగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా, వెంకటేశ్వర్లు గురుస్వామి అమ్మవారి భక్తిగీతాలతో భక్తులను అలరించారు.గీత ధర్మ ప్రచార సమితి సభ్యులు ఆలయం వద్ద లలితా సహస్రనామం, భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భవానీ దీక్ష స్వీకరించిన మాతలు, మహిళా భక్తులు,





స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భజన కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో మార్మోగింది. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అమ్మవారి కృపతో మణుగూరులో తొలిసారిగా ఇంతటి విశిష్టమైన నవదుర్గ అఖండ జ్యోతి పూజను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భక్తుల సహకారంతో రానున్న రోజుల్లోనూ ఈ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాపర్తి శ్రీహరినాథ్ గురుస్వామి, భవానీ మాతలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్త మండలి సభ్యులు, ఐలమ్మ నగర్ వాసులు పాల్గొన్నారు.





## నిజాంపేట కోట మైసమ్మ తల్లి, బోనాల వేడుకలో పాల్గోన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ఇల్లందు, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** కోట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే.విజయదశమిపండుగనుపురస్కరించుకోని రెపల్లెవాడ గ్రామ పంచాయితి పరిధిలోని నిజాం పేట వద్ద గల కోట మైసమ్మ అమ్మవారికి ప్రతి ఏటా నిర్వహించే బోనాల వేడుకలో భాగంగా ఆలయ కమిటి నిర్వహకుల ఆవ్వానం మేరకు హజరై గ్రామ ప్రజానికంతో కలిసి బోనం ఎత్తి అమ్మవారికి ప్రత్యేక పుజా కార్యక్రమం నిర్వహించిన ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండలం కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మండల రాంమహేష్, సర్పంచ్, దిశ కమిటి సభ్యురాలు బానోత్ శారద, నాయకులు పోటు రవి,మడుగుసాంబమూర్తి,సొసైటి డైరెక్టర్ కునుసోత్ రాము,మూతి క్రిష్ణ,దండుగుల శీవ,బింగి క్రిష్ణ,పూనెం శ్రీ రాములు, ఆలయ కమిటి చైర్మెన్ వాసం భద్రం తదితరులు పాల్గోన్నారు.

## గంజాయి సేవిస్తూ ముగ్గురు యువకులు పట్టివేత...

### – డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

**భద్రాచలం క్రైమ్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** గంజాయి సేవించి తచ్చాడుతున్న ముగ్గురు యువకులను భద్రాచలం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు ఆదేశాల మేరకు, డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ సూచనలతో టౌన్ సీఐ ఎస్. రాజు పర్యవేక్షణలో ఎస్సై వి. సతీష్ సోమవారం ఉదయం కరకట్ట ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఉదయం సమయంలో గోదావరి కరకట్ట దిగువన రెడ్డి సత్రం సమీపంలోని చెట్ల పొదల వద్ద ముగ్గురు యువకులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారు గంజాయి సేవించినట్లు అనుమానించి, ప్రత్యేక టెస్టింగ్ కిట్లతో పరీక్షలు చేయగా ముగ్గురికీ పాజిటివ్ వచ్చినట్లు తేలింది. దీంతో వారిని అరెస్ట్ చేసి, కౌన్సిలింగ్ నిమిత్తం డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు.ఈ సందర్భంగా సీఐ ఎస్. రాజు మాట్లాడుతూ గంజాయి విక్రయించినా, సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి రవాణా, వినియోగంపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఎవరికైనా గంజాయికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.




# తీరక్క పూలతో సద్దుల బతుకమ్మ

– చెరువు కట్ట వద్ద మున్సిపల్ సిబ్బందితో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన ఇల్లందు మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్.
చెరువు కట్ట ప్రాంగణంలో సభ్యుల బతుకమ్మ కోసం లైటింగ్ తో పాటు బతుకమ్మ ఆడుకోవడానికి పూర్తిస్థాయిలో ఏర్పాటు.
ఇల్లందు పట్టణంలో గట్టి బందోబస్తుఏర్పాటుచేసిన ఇల్లందు డి.ఎస్.పి. వెంకన్న బాబు











**ఇల్లందు, అక్టోబర్ 19 (మనం న్యూస్) :** ఇల్లందు పట్టణంలో గత కొన్ని దశాబ్దాలుగా దసరా పండుగకు ఇల్లందు పెట్టింది పేరు భాగ్యనగరం నుంచి విజయవాడ పరిసర ప్రాంత ప్రజానికం ఇల్లందులో దసరా వేడుకలు చూడడానికి విచ్చేయడం పరిపాటిగా జరిగే విషయం, అందులో భాగంగా ఆదివారం ఇల్లందు పట్టణంలో హిందూ మహిళా మణులు తీరోక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆట పాటలతో హోరెత్తించారు ,ప్రకృతిరమణీయ ంతతో పురుడు పోసుకున్న తీరోక్క పూలతో... పసిడి సైతం చిన్న బొచ్చుకునే విధంగా పేర్చిన బతుకమ్మలతో.. విద్యుత్ దీపాల వెలుతురులో కాంతులేనుతున్న వెలుతురులో సందడిలా సద్దుల బతుకమ్మ వేడుకను ఆడబిడ్డలు ఆటపాటలతో అలరించారు. తొమ్మిది రోజులపాటు రోజుకో పేరుతోబతుకమ్మఆటపాటలతో అంబురా నంటిన ఆడబిడ్డల పండుగ ఆదివారం సద్దుల బతుకమ్మతో ముగిసింది. ఇల్లందులో సింగరేణి ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాల క్రీడా మైదానంలో,మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇల్లెందులపాడు చెరువు కట్ట వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నచ్చినపూలతో మెచ్చిన బతుకమ్మలను అందంగా అలంకరించిన ఆడపడుచులు సద్దుల బతుకమ్మ వేల బతుకమ్మ ఆటపాటలతో ఆడి పాడారు. ఏడాది పాటు సుఖ సంతోషాలతో ఉండాలని ఆడపడుచులు గౌరమ్మను పూజించారు. సద్దుల బతుకమ్మ వేల ఇళ్లలో ఎంతో భక్తి శ్రద్ధలతో చేసిన







ప్రసాదాలను అందరికీ పంచుతూ ఆ భగవంతుడి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆడబిడ్డలు వేడుకున్నారు. ఇందులో భాగంగా ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, నేత్రుత్వంలో సీఐ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు... ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పాల్గొని మహిళా మణులతో చిందేసి మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. సుమారు సాయంత్రం 8 గంటల నుండి 10 గంటల వరకు పోరం కనకయ్య, దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, లు మహిళలతో డాన్సులు వేస్తూ పండగ వాతావరణం జోష్ పెంచారు.

## కోయగూడెం ఓసీలో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్-6



**టేకులపల్లి,అక్టోబర్ 19(మనం న్యూస్):** కోయగూడెం ఓసీలో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్--6 కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎన్విరాన్‌మెంట్ అధికారి నరసింహారావు అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథులుగా కేవైసీ పీవో మాధవరావు, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.మనం పనిచేసే కార్యాలయాలు, గనులు,పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.పని ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, పొదలు పెరగడం, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల పాములు, విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.దీనివల్ల కార్మికులు, ఉద్యోగుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల పొదలను తొలగించి, స్క్రాప్‌ను క్రమపద్ధతిలో నిల్వ ఉంచి,పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని తెలిపారు.వినియోగంలో లేని కంప్యూటర్లు, చిప్స్‌తో పాటు ఇతర ఈ-వేస్ట్, వ్యర్థ పదార్థాలను నిర్లక్ష్యంగా పడవేయకుండా, వాటిలోని అవసరమైన డేటాను భద్రపరిచి, అనంతరం నిబంధనల ప్రకారం స్క్రాప్ యార్డుకు తరలించాలని సూచించారు.స్వచ్ఛత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేటీసీ మేనేజర్ శ్రీనివాస్, అరుణ్ దినకర్, యూనియన్ నాయకులు కే వెంకటేశ్వర్లు,ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఊరూరా సంక్షేమ, సామాజిక భవనాలు నిర్మిస్తున్నాం

- ప్రజల సౌకర్యార్థమే భవనాల నిర్మాణం
- పేదలకుకోసం కమ్యూనిటీ హాళ్ల విస్తరణ
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు





**పాల్వంచ, అక్టోబర్ 19(మనం న్యూస్):** సమాజంలో ప్రతి ఒక్కరూ అంబేద్కర్ భవన్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా ప్రయోజనాల కోసమే సంక్షేమ భవనాలు, సామాజిక భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి (ఎస్) గ్రామ పంచాయతీలో గల అంబేద్కర్ భవనానికి అదనపు బ్లాకుల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీతో పాటు, కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాళు ,, సామాజిక భవనాలను విస్తృతంగా మంజూరు చేయించి ఒక్కొక్కటిగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. సామాజిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఈ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు స్థానిక మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ భూక్యా మంజుల, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అంబేద్కర్ భవన్ నిర్మాణ కమిటీ సభ్యులు కాల్వ భాస్కర్, ప్రకాష్, దాసరి నాగేశ్వరరావు, కొత్తపల్లి సోమయ్య, దండోరా శ్రీను, కత్తి శ్రీను, రాంబాబు, సీపీఐ నాయకులు ఇట్టి వెంకట్రావు, ఆలపాటి ప్రసాద్, నామ నవీన్, పండు, ఎరుకుల వెంకటేశ్వర్లు, విజయ్, ఎంపిడిఓ రాజారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులపై దాడిని సహించం!

- నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమిద్దాం
- ఈ నెల 25, 26 తేదీల్లో చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ పిలుపు

**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 19 (మనం న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న భారీ ధర్నా కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా శ్రామిక బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా కార్మికులు చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధానాలను తిప్పికొట్టేందుకు కార్మిక వర్గమంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కనీస వేతనాల అమలుపై సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కార్మికులకు న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పని గంటలను పెంచుతూ వారి శ్రమను దోచుకునే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానానికి బదులుగా కొన్ని చోట్ల 10 నుంచి 12 గంటల వరకు పని చేయిస్తుండటంతో కార్మికులపై తీవ్ర పని ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా కార్మికులు పని ప్రదేశాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, యాజమాన్యాలపై ఉందన్నారు. అధిక పని గంటలు, పని ఒత్తిడి మహిళా కార్మికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శ్రామికులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడంతో పాటు, చట్టబద్ధమైన హక్కులు, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తూ నిర్బంధాలకు గురిచేయడం సరైన విధానం కాదని భూక్య రమేష్ అన్నారు. అధికారంలోకి రాకముందు ఒక విధంగా మాట్లాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని కార్మికులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కనీస వేతనాల అమలు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, కార్మికుల హక్కుల పరిరక్షణ సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాలకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, రాజేష్, నాయకులు నందిపాటి రమేష్, అంబాల దుర్గమ్మ, శైలజ, రత్నకుమారి, భాగ్య, మహమ్మద్ నసూర్, ఎం. వెంకటేశ్వర్లు, నిహారిక, సాధం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





# ప్రకృతితో మమేకమైన మహోన్నత పండుగ

- శ్రమజీవుల ఐక్యతకు పల్లె సంబరాలే నిదర్శనం
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

**పాల్వంచ, అక్టోబర్ 19(మనం న్యూస్):**
పూలను పూజించి ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని, గ్రామీణ శ్రమజీవుల ఐక్యతకు ఈ సంబరాలు నిదర్శనమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పాల్వంచ పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మహిళలు ఆటపాటలతో జరుపుకుంటున్న వేడుకలను ఆయన నేరుగా సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రతిచెరువు, చింతల చెరువు ల వద్ద ఏర్పాటు చేసిన ఘాట్లను సందర్శించి, సామూహిక బతుకమ్మల నిమజ్జనోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయని, ఆడపడుచుల ముఖాల్లో ఆనందం నింపే ఇలాంటి మహోన్నత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని, పండుగ సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, కార్పోటర్లు నామ కీర్తి, గొర్లె అన్నపూర్ణ, నాయకులు వీ పద్మజ, శనగారపు శ్రీనివాసరావు, నిమ్మల రాంబాబు, నామ పండు, గొర్లె నరేష్, ఆలపాటి ప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ కె సుజాత, డిప్యూటీ కమిషనర్ విజయానంద్, ప్రజాప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

## భారీ సంఖ్యలో హాజరైన మహిళలు యువతులు

**ఖమ్మం అక్టోబర్ 19(మనం న్యూస్):** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఖమ్మం నగరంలో 14, 15వ డివిజన్ల పరిధిలో గల కొత్తగూడెంలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక సీపీఐ శాఖ కార్యాలయం ఎదుట సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్ని తాకాయి.ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ. తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఇష్టపడే ఈ బతుకమ్మ పండుగ సందర్భంగా, వివిధ రకాల రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను వద్దకు తీసుకొచ్చి మహిళలు, యువతులు సాంప్రదాయ వస్త్రధారణలో మెరుస్తూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ భక్తిభావంతో సాగిన గౌరమ్మ పాటలు, కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక 14, 15వ డివిజన్ల మహిళలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా మార్మోగిందని ఆనందం వ్యక్తం చేశారు. పూల బతుకమ్మలను సాయంత్రం వేళ సామూహికంగా నిమజ్జనం చేసే కార్యక్రమంతో వేడుకలు కన్నులపండువగా ముగిశాయని తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను సమున్నతంగా చాటే ఈ వేడుకలు అందరిలోనూ సరికొత్త ఉత్సాహాన్ని నింపాయన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, భూమా రాంమూర్తి, సీతల సత్యం, లక్కా వీరయ్య, పోతురాజు వెంకటేశ్వర్లు, పగడాల శ్రీను, పర్వత సైదులు, మాకనబోయిన నాగేశ్వరరావు, ములకలపల్లి అచ్చయ్య, భూమా జాను, తుపాకుల శ్రీకాంత్, కోటేశ్వరరావు, నాగరాజు, షేక్. ఫకీర్, చింతకాయల లక్ష్మినారాయణ, పగడాల వెంకటేశ్వర్లు, అమరారపు ఉపెందర్, చింతకాయల హనుమంతరావు, నాగటి నరేష్, దంతాల శ్రీకాంత్, పగడాల చంద్రశేఖర్, చాగంటి వెంకట నర్సయ్య, లింగం సూరి, భూమా ఉపెందర్, అమరారపు వెంకటమ్మ, లక్క రేణుకా, దంతాల రాధ,త్రీవేణీ, మాకనబోయిన పార్వతి, యాదమ్మ పాల్గొన్నారు.

# ఖమ్మంలో వైభవంగా కన్యా పూజ.. నవదుర్గలుగా చిన్నారులు

**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్):** నగరంలోని రిక్కా బజార్ 25వ డివిజన్లో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు కన్యా పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు . తొమ్మిది మంది చిన్నారులను నవదుర్గలుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు . చిన్నారులకు పాదపూజలు చేసి , హారతులు ఇచ్చి , గాజులు , చీరలు , పూలు సమర్పించారు . వారికి ఇష్టమైన నైవేద్యాలను తయారుచేసి ఆశీస్సులు పొందారు . హిందూ సంప్రదాయంలో కన్యా పూజకు విశిష్టమైన ప్రాముఖ్యత ఉందని , బాలికలను దుర్గాదేవి తొమ్మిది రూపాలకు ప్రతీకగా భావించి పూజించడం ఆనవాయితీ అని నిర్వాహకులు తెలిపారు . ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకటేశ్వర్లు , కవిత , సరిత , రేణుక , భాగ్యలక్ష్మి , లత తదితరులు పాల్గొన్నారు

# జనసేన బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం

**-జనసేన తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రీ గడల శ్రీనివాసరావు**
**-ఖమ్మంలో ఘనంగా పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం**





**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్):** జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని, తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేనను నిలబెడతామని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జనసేన పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం వేడుక ఖమ్మం జిల్లా కేంద్రంలోని గట్టయ్య సెంటర్ ప్రాంతంలో గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అత్యంత ఘనంగా జరిగింది. కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, సాంప్రదాయ పద్ధతిలో రిబ్బన్ కట్ చేసి కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు చేతుల మీదుగా జనసేన జెండా ఆవిష్కరించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం పనిచేయనుందని డాక్టర్ గడల శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కోటి అప్పారావ్, దుంపటి శ్రీనివాస్, రాము యాదవ్, మిర్యాల రామకృష్ణ, మిరియాల జగన్ మోహన్, బండారు రామకృష్ణ, యాసంనేని అజయ్ కృష్ణ, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, హసీనా, తాళ్లూరి డేవిడ్, ఆంగోతి శ్రీను, తుడుం ఉత్తం రాజ్ , సమ్మ స్రవంతి కన్నా, శివరాత్రి రమణ కుమార్, సాయి కుమార్, గంజి ఉదయ్, మామిడి ఉదయ్, నాగరాజు, రాజేంద్రప్రసాద్, బద్రి, బాలరాజు, తుమ్మలపూడి గంగాధర్, కొమ్ము అచ్యుత్, హనుమంతు మౌనిక, దేవేందర్, వెంకన్న, హనుమంతు సాయి కృష్ణ, మద్ది సాయికుమార్, కొమ్ము లక్ష్మి, భరత్, ఆనంద్, రాకేష్, వంశీ, పుల్లారావు, దుర్గాప్రసాద్, నరేష్, హరి, శ్రీకాంత్, నిర్మల, విజయలక్ష్మి ఫయాజ్, బాణాల శ్రీకాంత్, రచ్చ నాగరాజు, జనసైనికులు, వీరమహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**జనసేనలో చేరికలు**

ఖమ్మంలో జనసేన పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకులు గంగిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 20 మందికి పైగా కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్ళూరి మామ కోటి అప్పారావ్ జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన అభ్యర్థి డాక్టర్ శ్రీ గడల శ్రీనివాసరావు చేతుల మీదుగా పార్టీ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. రాజేష్, శ్యామ్, మల్లయ్య, సందీప్, పుల్లారావు, సాయి, సుందర్, ఫరీద్, అరుణ్ కుమార్, ప్రసాద్, ఆనంద్, రవితేజ, బీమా, నరేష్, సందీప్, ప్రవీణ్, గణేష్, మోహన్, రంగా, ప్రభు దీవెన, ప్రమోద్ కుమార్, బాలు, మోహన్, వెంకట్, శంకర్, చంద్రశేఖర్, కిషన్ నాయక్, కృష్ణ చంద్ర, ఏడుకొండలు, సతీష్, లీలా, పద్మ వేణు, సాయి, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## ఎంపీ వద్దిరాజు దసరా శుభాకాంక్షలు



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్):** దసరా (విజయ దశమి) పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హిందువుల ముఖ్యమైన పండుగల్లో ఇదొకటని, ఈ సందర్భంగా శక్తి స్వరూపిణి దుర్గామాతను కొలుస్తూ దేవీ నవ శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా జరుపుకుంటామని, భక్తులు మాలలు ధరించి నిష్ఠతో అమ్మ వారికి పూజలు చేస్తారన్నారు.శ్రీరామచంద్రుడు రాక్షసుల రాజు రావణుడిని అంతమొందించిన శుభదినాన్ని గుర్తు చేసుకుంటూ విజయదశమి పండుగను జరుపుకోవడం అనాది నుంచి ఆనవాయితీగా వస్తున్నదని ఎంపీ రవిచంద్ర తన సందేశంలో పేర్కొన్నారు.అలాగే, పాండవులు 12 ఏళ్ల వనవాసం,ఒక సంవత్సరం అజ్ఞాతవాసం ముగించుకుని శమీ వృక్షం(జమ్మి చెట్టు) పై తాము దాచిపెట్టిన ఆయుధాలను తిరిగి చేతబట్టినది కూడా విజయదశమి నాడే అని మనకు పురాణాలు చెబుతున్నాయన్నారు.ఆయుధ పూజ చేసి జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు గావించి మనసులో ఉన్న కోరికను నెరవేర్చాలంటూ మొక్కడం,పాలపిట్టను దర్శించుకోవడం మన ఆచారమని ఎంపీ రవిచంద్ర వివరించారు.బతుకమ్మ,దసరా పర్వదినాలను పురస్కరించుకుని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల తన పాలనలో పేద వర్గాల వారికి దుస్తులను బహూకరించేవారని ఆయన చెప్పారు.దసరాను తెలంగాణ ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సరదాగా, సంతోషంగా జరుపుకోవాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు.విజయదశమి సందర్భంగా రాష్ట్ర వాసులతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన, నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలి

**జీవో 1195పై పునఃసమీక్ష చేయాలి- ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి**
**బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు**



**ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 17 వేల మంది నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం) ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని, వారి వేతనాలు, ఉద్యోగ భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 1195 అమలుతో ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలను సమీక్షించి, వారికి న్యాయం చేయాలని కోరారు. ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో సోమవారం నిరవధిక ధర్నా నిర్వహిస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగుల శిబిరాన్ని సందర్శించిన దేవకి వాసుదేవరావు వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో సుమారు 570 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు ప్రజలకు వైద్య సేవలందిస్తున్నప్పటికీ, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం విచారకరమన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతను విస్మరిస్తోందా?**

ఎన్హెచ్ఎం నిధుల వాటాలో కేంద్ర ప్రభుత్వం తన 60 శాతం వాటాను విడుదల చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన 40 శాతం నిధులను సకాలంలో విడుదల చేయడం లేదని దేవకి వాసుదేవరావు విమర్శించారు. కేంద్రం తన బాధ్యతను నిర్వర్తిస్తున్నప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాను సక్రమంగా విడుదల చేసి ఉద్యోగుల వేతనాలు, ప్రజారోగ్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధుల విడుదలలో జాప్యం చేస్తూ ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. నిధుల విడుదల, వేతనాల చెల్లింపుల విషయంలో స్పష్టత తీసుకురావడంతో పాటు, ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**క్రమబద్ధీకరణ హామీ ఏమైంది?**

ఎన్నికల సమయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని దేవకి వాసుదేవరావు విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం కాంగ్రెస్ నాయకులకు సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి, ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**జీవో 1195పై పునఃసమీక్ష చేయాలి**

జీవో 1195 అమలుతో వేతనాల విషయంలో ఉద్యోగులకు ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. వేతనాలకు సంబంధించిన నిబంధనలను సమీక్షించి, ఉద్యోగులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, వేతనాలు, వార్షిక ఇంక్రిమెంట్లు, ఇతర సేవా ప్రయోజనాలపై స్పష్టమైన విధానం ప్రకటించాలన్నారు.

**కరోనా సేవలను గుర్తించి ఉద్యోగులకు న్యాయం చేయాలి**

కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఎన్హెచ్ఎం ఉద్యోగులు చేసిన సేవలు మరువలేనివని దేవకి వాసుదేవరావు కొనియాడారు. అలాంటి ఉద్యోగులు నేడు తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కాల్సి రావడం విచారకరమన్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు కీలక బాధ్యతల్లో ఉన్నప్పటికీ, సుమారు 570 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేయాల్సి రావడం గమనార్హమన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల ప్రతినిధులతో చర్చలు జరిపి, నిధుల విడుదల, వేతన సమస్యలు, క్రమబద్ధీకరణ అంశాలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి అండగా నిలుస్తామని, క్రమబద్ధీకరణతో పాటు న్యాయమైన హక్కుల సాధన కోసం తమ మద్దతు కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకటేశ్వర్లు,పాలేపు రాము, వల్లాల రమేష్, అశోక్,పాల్గొన్నారు..